ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 138 బుధవారం 06 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-


Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 138 Wednesday 06 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


# త్వరలో రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- మూడు, నాలుగు రోజుల్లో రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్న మంత్రి పొంగులేటి
- హనుమకొండలో రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాను ప్రారంభించిన మంత్రులు
- రైతులకు ఎకరానికి రూ.12 వేలతో పాటు వ్యవసాయ పరికరాలు ఇస్తున్నామన్న పొంగులేటి
- రైతును రాజు చేసే వరకు విశ్రమించబోమని వ్యాఖ్య



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 05 :**
సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాతి ప్రభుత్వం నడుస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. వారు(బీఆర్ఎస్) రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21 వేల కోట్లు చెల్లించామన్న ఆయన వరి వేసిన రైతులకు మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. హనుమకొండలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారని, తాము మాత్రం రైతును రాజు చేసే వరకు విశ్రమించబోమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతులకు ఎకరానికి రూ.12 వేలతో పాటు వ్యవసాయ పరికరాలు ఇస్తూ, కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటుకు రూ.1200 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. మూడు, నాలుగు రోజుల్లో - మిగతా 2 లో


2 లో

## నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు అనుమతులపై దృష్టి సారించనున్న సీఎం
- కాంగ్రెస్ పెద్దలను కలవనున్న రేవంత్
- కేరళలో యూడీఎఫ్ విజయం నేపథ్యంలో రేవంత్ పర్యటనకు మరింత ప్రాధాన్యత

## ఇచ్చిన హామీలకు... చేస్తున్న పనులకు పొంతన లేదు



- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న ఈటల
- బిల్లులు అందక కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన
- మమత అహంకారానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని వ్యాఖ్య

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 05 :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం ఆయన చేస్తున్న పనులకు ఏమాత్రం పొంతన లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గజ్వేల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవీ - మిగతా 2 లో

# మేం ఓడిపోలేదు నేను సీఎం పదవికి రాజీనామా చేయను...

- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ
- బెంగాల్ ఎన్నికల ఫలితాలను తిరస్కరించిన మమతా బెనర్జీ
- 100 స్థానాలను అక్రమంగా దక్కించుకున్నారని ఆరోపణ
- ఎన్నికల అక్రమాలపై 15 మందితో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ
- భవానీపూర్‌లో ఓడినా రాజీనామా చేయబోనని స్పష్టీకరణ
- మమతకు ఇండియా కూటమి నేతల మద్దతు




**వార్త సంధ్య, పశ్చిమ బెంగాల్, మే 05 :**
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పూర్తిగా తిరస్కరించారు. తాను సీఎం పదవికి రాజీనామా చేయబోనని, తాము ఓడిపోలేదని అన్నారు. ఎన్నికల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, ఇది "ప్రజాస్వామ్య హత్య" అని ఆమె తీవ్రంగా వ్యాఖ్యానించారు. తాము ఈ ఫలితాలను చట్టబద్ధమైన ఓటమిగా అంగీకరించబోమని స్పష్టం చేశారు.కోల్‌కతాలో సోమవారం ఏర్పాటు చేసిన - మిగతా 2 లో

# విజయ్ ప్రమాణస్వీకారం?



- టీవీకే గెలుపు తర్వాత తొలిసారి ట్వీట్
- తమిళనాడు అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తా
- రాష్ట్ర ప్రయోజనాలే తొలి ప్రాధాన్యం
- మోదీ శుభాకాంక్షలకు ధన్యవాదాలు తెలియజేసిన విజయ్

**వార్త సంధ్య, చెన్నై, మే 05 :**
తమిళనాడు అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని టీవీకే అధ్యక్షుడు విజయ్ తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలే తమ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలకు విజయ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజల శ్రేయస్సు, సంక్షేమమే తన ఏకైక లక్ష్యమని తెలిపారు. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి తమిళనాడు ప్రగతిపైనే దృష్టి సారిస్తామని ఆయన ఉద్ఘాటించారు. తమిళనాడు అభివృద్ధికి కేంద్ర సహకారం కావాలని విజయ్ కోరారు. మరోవైపు, రాహుల్ శుభాకాంక్షలపై స్పందించిన విజయ్, తమిళనాడు అస్తిత్వం, సంస్కృతి పరిరక్షణకు అందరి సహకారం అవసరమని - మిగతా 2 లో



## ప్రాణాలకు తెగించి సాహసం


- ఆటో డ్రైవర్‌ను సత్కరించిన సీపీ సజ్జనార్
- మార్నింగ్ వాక్ చేస్తుండగా మహిళ మెడలో గొలుసు దొంగిలించేందుకు యత్నం
- దుండగుడిని ఆటోతో ఢీకొట్టిన డ్రైవర్.. పోలీసులకు నిందితుడి అప్పగింత
- జాహెర్‌ను గుర్తించి సత్కరించిన సీపీ సజ్జనార్

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 05 :**
ప్రాణాలకు తెగించి సాహసం ప్రదర్శించిన ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్‌ను హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. బేగంబజార్ జీన్సీ చౌరహా ప్రాంతంలో ఓ మహిళ తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్ చేస్తుండగా రౌడీషీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసు - మిగతా 2 లో

## ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు 'కమలం' మ్యాప్

- మ్యాప్‌ను షేర్ చేసిన బీజేపీ
- భారతదేశం 'మోదీమయం' అంటూ ట్వీట్
- ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు గెలుపు కేవలం విస్తరణ కాదని వ్యాఖ్య
- ప్రగతి పథంలో సాగేందుకు ప్రజలు బీజేపీపై చూపిన విశ్వాసానికి ప్రతీక అని ట్వీట్

2 లో




## నెలాఖరుకు ల్యాండ్‌పూలింగ్ పూర్తి

- మంత్రి నారాయణ
- రాజధాని సమస్యలపై త్రిసభ్య కమిటీ సమీక్ష
- గ్రామాల్లో పర్యటించాలని, గ్రామసభలు పెట్టాలని ఆదేశం ఎన్ఎస్పీ బాధితుల ఇళ్లు, ఎఫ్ఎస్ఐపై చర్చ
- 2-3 వారాల్లో మరో భేటీ



**వార్త సంధ్య, అమరావతి, మే 05 :**
రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసం సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సమావేశమైంది. అనివార్య కారణాలు, అసెంబ్లీ సమావేశాల వల్ల కమిటీ భేటీ కొంత ఆలస్యమైందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇటీవలే సీఆర్డీఏ కమిషనర్‌గా విజయరామరాజు బాధ్యతలు స్వీకరించినట్లు వెల్లడించారు. సోమవారం జరిగిన సమావేశంలో రాజధాని గ్రామాల సమస్యలపై కీలకంగా చర్చించామని మంత్రి తెలిపారు. ఎన్ఎస్పీ ప్రభావిత - మిగతా 2 లో



## శస్త్రచికిత్స తర్వాత తొలిసారి బయటకొచ్చిన పవన్ కల్యాణ్

- దివంగత మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావుకు నివాళి
- హైదరాబాద్‌లో నాదెండ్ల చిత్రపటానికి పుష్పాంజలి
- మంత్రి నాదెండ్ల మనోహర్, కుటుంబ సభ్యులకు పరామర్శ
- గత నెలలో అనారోగ్యం కారణంగా రాలేకపోయిన పవన్

**వార్త సంధ్య, అమరావతి, మే 05 :**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, శస్త్రచికిత్స అనంతరం పూర్తిస్థాయిలో కోలుకున్నాక తొలిసారిగా మంగళవారం బయటకు వచ్చారు. ఇటీవల దివంగతులైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావుకు ఆయన నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నాదెండ్ల నివాసానికి వెళ్లిన పవన్, భాస్కరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.గత నెల 22న నాదెండ్ల భాస్కరరావు కన్నుమూసిన సంగతి తెలిసిందే. - మిగతా 2 లో

# విశాఖ రైల్వే జోన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- గెజిట్ నోటిఫికేషన్ జారీ
- విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు గెజిట్ జారీ
- జూన్ 1, 2026 నుంచి అధికారికంగా కార్యకలాపాల ప్రారంభం
- దేశంలో 18వ రైల్వే జోన్‌గా దక్షిణ కోస్తా రైల్వే జోన్ గుర్తింపు
- గుంతకల్, గుంటూరు, విజయవాడ డివిజన్లు ఈ జోన్ పరిధిలోకి
- ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీని నెరవేర్చిన కేంద్ర ప్రభుత్వం






**వార్త సంధ్య, విశాఖపట్నం , మే 05 :**
ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు కల సాకారమైంది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కొత్త జోన్ 2026, జూన్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తుందని నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీంతో, భారతీయ రైల్వేలో దక్షిణ కోస్తా రైల్వే 18వ జోన్‌గా అవతరించనుంది.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో ఇచ్చిన హామీ మేరకు ఈ జోన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కొత్త - మిగతా 2 లో

# సంపాదకీయం

## సౌదీకి సవాల్..!

పెట్రోలియం ఎగుమతి దేశాల కూటమి (ఒపెక్) నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తప్పుకోవడం అమెరికా అధ్యక్షుడికి నచ్చింది. ఇది ఎంతో మంచి నిర్ణయమనీ, ఎమిరేట్స్ అధ్యక్షుడు మహ్మద్ తెలివైనవారు కనుక, ఇలా స్వతంత్రంగా నడవాలని నిర్ణయించు కున్నారని, దీనితో చమురు, గ్యాస్ ధరలు దిగొస్తాయని ట్రంప్ అన్నారు. ఎమిరేట్స్ నిర్ణయం అమెరికాకు లాభిస్తుందన్న వాదనలను అటుంచితే, ఒపెక్ తన ఉత్పత్తిని నియంత్రిస్తూ చమురు ధరలు పెరిగేట్టు చేసి ప్రపంచ ఆర్థికవ్యవస్థను శాసిస్తున్నదంటూ గతంలో ఆయన విమర్శలు చేసిన విషయం తెలిసిందే. కోవిడ్ కాలంలో ధరలు పడిపోయి అమెరికన్ కంపెనీలు తీవ్ర నష్టాలు చవిచూస్తున్న సందర్భంలో ఆయనే ఈ కూటమికి ఉత్పత్తి తగ్గించమంటూ విజ్ఞప్తులు, హెచ్చరికలు చేశారు. బంధనాలు తెంపేసుకున్న ఎమిరేట్స్ ఇక సర్వస్వతంత్రంగా నచ్చినంత చమురు ఉత్పత్తి చేయగలదు కనుక ప్రపంచ ఆయిల్ మార్కెట్ మీద దీని ప్రభావం ఏ విధంగా ఉండబోతోందన్న అంశంపై చర్చోపచర్చలు సాగుతున్నాయి.కూటమిలో ఉండగా కూడా ఎమిరేట్స్ తన వాటాలూ కోటాలను తరచూ ఉల్లంఘిస్తూనే ఉందని, అందువల్ల, ఇప్పుడు దాని నిష్క్రమణ పెద్ద ప్రభావం చూపకపోవచ్చునని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. ఒపెక్‌లో మూడవ అతిపెద్ద చమురు ఉత్పత్తిదేశమైన ఎమిరేట్స్ ఆరు దశాబ్దాల తరువాత తీసుకున్న ఈ నిర్ణయం వెనుక సౌదీతో దానికి ఉన్న భౌగోళిక ఆధిపత్య పోరు అసలు కారణం. ఉత్పత్తిని రోజుకు ఐదు మిలియన్ బారెల్స్‌కు పెంచాలని దాని లక్ష్యం. ఒపెక్‌కు బాస్‌గా వ్యవహరిస్తున్న సౌదీ అరేబియా ఆది నుంచీ ఎమిరేట్స్‌కు ఉత్పత్తి విషయంలో అడ్డుపడుతూనే ఉంది. ఇక సూడాన్, సోమాలియా, యెమెన్ వంటి దేశాల్లో వైరివర్గాలను ఇవి రెండూ ఇతోధికంగా ఎగదోస్తున్న చరిత్ర తెలిసిందే. అమెరికా ఇజ్రాయెల్‌తో ఇటీవలి కాలంలో ఎమిరేట్స్ మరింత సాన్నిహిత్యం పెంచుకోవడం కూడా ఈ గల్ఫ్ కూటమిలో విభేదాలకు కారణమైంది. ఇరాన్ దాడులకు ఎమిరేట్స్ అత్యధికంగా దెబ్బతిన్నది కూడా ఇందుకే. మిసైళ్ళు, డ్రోన్లతో ఎమిరేట్స్ చమురు ఉత్పత్తి కేంద్రాలు, ఇంధన నిల్వలు, నౌకలు, అక్కడి అమెరికా సైనిక స్థావరాలు, ఆయుధాగారాలను ఇరాన్ పెద్ద ఎత్తున దెబ్బతీసింది. ఐదువందల బాలిస్టిక్ మిసైళ్ళు, పాతిక క్రూయిజ్ మిసైళ్ళు, వేలాది డ్రోన్లను ఎమిరేట్స్ మీద ఇరాన్ ప్రయోగించింది. అమెరికాఇరాన్ యుద్ధం చమురు సరఫరా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన నేపథ్యంలో, ఇరాన్ మీద కక్షసాధింపు లక్ష్యంతో ఎమిరేట్స్ ఈ నిర్ణయం తీసుకుందని అంటారు.సౌదీతో వైరం ప్రత్యక్షంగా మారిన తరువాత ముసుగులో గుద్దులాట ఎందుకని కూడా ఎమిరేట్స్ అనుకున్నట్టు ఉంది. ఒపెక్‌లో ఉండటం అంటే రియాద్ పెత్తనాన్ని ఆమోదించడమే. బయటకు వచ్చి తన స్వతంత్రతను నిలబెట్టుకోవడంతో పాటు, ఒపెక్‌ను బలహీనపరచాలన్న ట్రంప్ కోరికను కూడా తీర్చినట్టు అవుతుందని సౌదీ ఆలోచన. ఈ నిష్క్రమణతో చమురు మార్కెట్‌మీద ఒపెక్ పట్టు బలహీనపడుతుంది. రేపోమాపో మరిన్ని దేశాలు కూడా క్యూ కట్టవచ్చు. ఎమిరేట్స్‌కు ఇక కోటాలకు కట్టుబడాల్సిన బాధ ఉండదు కనుక అది తనకు నచ్చినంత, అమెరికా మెచ్చినంత చమురు తోడిపోయవచ్చు, ఇష్టమైన రేటుకు అమ్ముకోవచ్చు. దీనికితోడు, యుద్ధంలో ఇరాన్ చేకూర్చిన నష్టాన్ని కూడా త్వరితంగా పూడ్చుకోవచ్చు. ఎమిరేట్స్‌తో కలిసి ప్రపంచ చమురు మార్కెట్‌ను దశాబ్దాలుగా శాసించగలిగిన సౌదీ అరేబియా ఇకపై ఆ పెత్తనాన్ని చెలాయించలేదు. అమెరికా షేల్ ఆయిల్ కంపెనీల ఉత్పత్తినీ, వాటిలో పెట్టుబడులనూ దెబ్బతీయడం కోసం ప్రపంచ ఆయిల్ మార్కెట్‌ను అధిక ఉత్పత్తితో, తక్కువ ధరలతో ముంచెత్తిన ఒపెక్ ఇకపై అటువంటి విన్యాసాలకు కూడా పాల్పడలేదు. సామర్థ్యం ఉండి కూడా మూడోవంతు ఉత్పత్తిని బలవంతంగా నియంత్రించుకోవాల్సిన అవసరం ఇక ఎమిరేట్స్‌కు ఉండదు కనుక, హోర్ముజ్ నిర్బంధంతో ప్రపంచానికి ఏర్పడిన చమురు లోటును పూడ్చి, ఈ సంక్షోభ సమయాన్ని సొమ్ముచేసుకోవచ్చు. ఎమిరేట్స్ నిర్ణయం భారతదేశానికి మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. ఆ దేశంతో ఉన్న సత్సంబంధాల రీత్యా మనకు సరఫరాలు మరింత పెంచగలిగే అవకాశం ఇప్పుడు దానికి ఉంది. ప్రస్తుతానికి పదిశాతం లోపు ఉన్న దాని వాటా బాగా హెచ్చవచ్చు. డాలర్ బదులు రూపాయితో చమురు కొనుగోలు చేయగలిగితే మరీ మంచిది.

## విశాఖ రైల్వే జోన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి -** జోన్ పరిధిలోకి ప్రస్తుతం ఉన్న గుంతకల్, గుంటూరు, విజయవాడ డివిజన్లు వస్తాయి. అదేవిధంగా, ప్రస్తుత వాల్తేరు డివిజన్‌ను విభజించి, దానిలోని కొంత భాగాన్ని విశాఖపట్నం డివిజన్‌గా ఏర్పాటు చేసి కొత్త జోన్‌లో కలుపుతారు. మిగిలిన భాగాన్ని రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్‌ను ఏర్పాటు చేసి, దానిని ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో ఉంచుతారు.ఇటీవల ఏప్రిల్ 28న విశాఖపట్నంలో పర్యటించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, జూన్ 1వ తేదీ నుంచి జోన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే తాజాగా కేంద్రం గెజిట్ విడుదల చేసింది. ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే పరిపాలన, కార్యకలాపాలు మరింత మెరుగుపడతాయని అధికారులు భావిస్తున్నారు.

## ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు'కమలం' మ్యాప్

**మొదటిపేజీ తరువాయి -** పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ గెలుపు నేపథ్యంలో బీజేపీ 'ఎక్స్' వేదికగా 'మోదీమయమైన భారత్' అని ట్వీట్ చేసింది. కమలం బెంగాల్‌ను కూడా చేరుకుందని పేర్కొంది. ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు గెలుపు కేవలం విస్తరణ కాదని, ప్రగతిపథంలో సాగేందుకు దేశ ప్రజలు తమపై చూపించిన విశ్వాసానికి ప్రతీక అని రాసుకొచ్చింది.ఉత్తరాది నుంచి ఈశాన్యం వరకు మార్పు కొనసాగుతోందని, ఇప్పుడీ ప్రయాణంలో పశ్చిమ బెంగాల్ అనే అతిపెద్ద అధ్యాయం చేరిందని పేర్కొంది. మనందరం కలిసి 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మిద్దామని 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చింది. ఈ మేరకు బీజేపీ ఒంటరిగా, మిత్రపక్షాలతో కలిసి అధికారంలో ఉన్న రాష్ట్రాలతో మ్యాప్‌ను పంచుకుంది.హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, అసోం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, సిక్కిం, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో బీజేపీ, మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయంటూ కాషాయం రంగుతో మ్యాప్‌ను ట్వీట్ చేసింది. దీని ప్రకారం, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఝార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, మిజోరాంలలో బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్నాయి.

## శస్త్రచికిత్స తర్వాత తొలిసారి బయటకొచ్చిన పవన్ కల్యాణ్

**మొదటిపేజీ తరువాయి -** ఆ సమయంలో పవన్ కల్యాణ్ సైనస్ సమస్యకు శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఆయన అంత్యక్రియలకు హాజరుకాలేకపోయారు. అయితే, వార్త తెలిసిన వెంటనే భాస్కరరావు కుమారుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్‌లో పరామర్శించారు.తాజాగా ఆరోగ్యం కుదుటపడటంతో వైద్యుల సూచన మేరకు మంగళవారం ఆయన నేరుగా సహచర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. చాలా రోజుల తర్వాత పవన్ కల్యాణ్ మళ్లీ సాధారణ స్థితిలో కనిపించడంతో జనసేన కార్యకర్తలు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మేం ఓడిపోలేదు నేను సీఎం పదవికి రాజీనామా చేయను...

**మొదటిపేజీ తరువాయి -** విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో బీజేపీ దాదాపు 100 స్థానాలను అక్రమంగా దొంగిలించిందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషన్, కేంద్ర బలగాలు పక్షపాతంగా వ్యవహరించాయని, దాదాపు 90 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి కుట్రపూరితంగా తొలగించారని విమర్శించారు.తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లోనూ ఓటమి పాలైనప్పటికీ, తాను రాజీనామా చేయబోనని మమత స్పష్టం చేశారు. తన రాజకీయ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై నిజ నిర్ధారణకు 15 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రానికి వెళ్తున్న సమయంలో తన కారును అడ్డుకుని, తనపై భౌతిక దాడికి యత్నించారని ఆమె ఆరోపించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు గూండాల్లా వ్యవహరించాయని మండిపడ్డారు.ఈ క్లిష్ట సమయంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్, అఖిలేష్ యాదవ్ వంటి 'ఇండియా' కూటమి నేతలు తనకు ఫోన్ చేసి మద్దతు తెలిపారని మమత వెల్లడించారు. మొత్తం 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 సీట్లు గెలుచుకుని అధికారాన్ని కైవసం చేసుకోగా, టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాల రోజును బెంగాల్ రాజకీయ చరిత్రలో ఒక 'చీకటి రోజు'గా ఆమె అభివర్ణించారు.

## విజయ్ ప్రమాణస్వీకారం?

**మొదటిపేజీ తరువాయి -** పేర్కొన్నారు.అదేవిధంగా, గురువారం తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చెన్నై నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే, బుధవారం గవర్నర్‌ను కలవనున్నట్లు టీవీకే అధ్యక్షుడు విజయ్ తెలిపారు.

# నెలాఖరుకు ల్యాండ్‌పూలింగ్ పూర్తి


**మొదటిపేజీ తరువాయి -** బాధితుల ఇళ్ల సమస్య, ఎఫ్ఎస్ఐ అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడామన్నారు. రాజధాని ప్రాంతంలో గ్రామీణ రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.'రాజధాని రైతుల సమస్యలపై సీఆర్డీఏలో త్రిసభ్య కమిటీ కొన్ని కారణాల వల్ల ఆలస్యమయ్యింది. ఇకపై అలా జరగకుండా చూసుకుంటాం. 29 గ్రామాల్లో కమిషనర్ పర్యటించి గ్రామసభలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించాం. ఆర్ ఫై జోన్ రద్దు చేశాం. ల్యాండ్ పూలింగ్ 40 శాతం పూర్తయింది, ఈ నెలాఖరుకు 60 శాతం పూర్తి చేస్తాం.' నారాయణ, పురపాలక శాఖ మంత్రికమిషనర్లు, జాయింట్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సమావేశంలో నిర్ణయించామని మంత్రి నారాయణ తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే



దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో 2-3 వారాల్లో రెగ్యులర్ సమావేశాలు నిర్వహిస్తామని, అంశాల వారీగా సమీక్ష చేసి పరిష్కారాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించామని వివరించారు. గ్రామ కంఠాల సమస్యలు, రోడ్ల విస్తరణలో భూములు కోల్పోయే నిర్వాసితుల ఇబ్బందులపై చర్చించామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆదేశాలు ఇచ్చామని, 29 గ్రామాల్లో కమిషనర్ స్వయంగా పర్యటించాలని సూచించామని తెలిపారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కూడా ఆదేశించినట్లు చెప్పారు.ఆర్ ఫై జోన్ రద్దు-ల్యాండ్ పూలింగ్ వేగవంతం: ఆర్ ఫై జోన్‌ను వెనక్కి తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం మూడు గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ 40 శాతం పూర్తయిందని, కౌలు పెంపుతో రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ నెల చివరి నాటికి ల్యాండ్ పూలింగ్ 60 శాతం వరకు పూర్తవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

# ప్రాణాలకు తెగించి సాహసం

**మొదటిపేజీ తరువాయి -** లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో స్కూటీ అదుపు తప్పి దొంగ కిందపడిపోయాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో అదే సమయంలో అటుగా వెళుతున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ గమనించాడు.వెంటనే తన ఆటోను వెనక్కి తిప్పి రౌడీ షీటర్‌ను తన ఆటోతో ఢీకొట్టాడు. దీంతో నిందితుడు కత్రితో జాహెర్‌పై దాడికి ప్రయత్నించాడు. కానీ జాహెర్ ధైర్యంగా రడీ షీటర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు నమోదయ్యాయి. దీంతో సజ్జనార్ ఆటో డ్రైవర్ జాహెర్‌ను సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. దీనికి సంబంధించి సజ్జనార్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు."నేరం జరుగుతుంటే చూస్తూ ఉండిపోవడం కాదు. ఆ నేరగాడిని పట్టుకోవడమే అసలైన పౌర ధర్మమని నిరూపించారు ఒక సామాన్య ఆటో డ్రైవర్. ఒక మహిళా బాధితురాలి మెడలోని బంగారు గొలుసును రౌడీ షీటర్ లాక్కెళ్లేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలకు తెగించి, తన ఆటోనే ఆయుధంగా మలచుకొని సాహసోపేతంగా మహమ్మద్ జాహెర్ రౌడీ షీటర్ ను అడ్డుకున్నారు. కత్రితో దాడి చేస్తోన్న బెదరకుండా ప్రతిఘటించారు" అని కొనియాడారు.ఆటో డ్రైవర్ సాహసం గురించి గోషామహల్ పోలీసులకు బాధితురాలు తెలియజేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలన్నీ అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. జాహెర్ రౌడీ షీటర్‌ను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించి, నిస్వార్థంగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అతని కోసం గోషామహల్ పోలీసులు గాలించారు. సీసీటీవీ ఫుటేజీలో ఆటో నంబర్‌ను సేకరించి, సాంకేతిక పరిజ్ఞానంతో జాహెర్‌ను గుర్తించి, అభినందించారు.ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ, ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ చూపిన సాహసం సమాజానికి ఆదర్శమన్నారు. "చూస్తుండగానే నేరాలు జరుగుతున్నా పట్టించుకోని ఈ రోజుల్లో, ప్రాణాలకు తెగించి రౌడీ షీటర్ ను అడ్డుకున్న జాహెర్ సమాజానికి నిజమైన రోల్ మోడల్. ఆయనలో ఒక అద్భుతమైన ప్రజా పోలీస్ ఉన్నారు. ఎలాంటి ప్రతిఫలం కూడా ఆశించలేదు. ఇలాంటి బాధ్యతాయుతమైన పౌరులు ఉన్నప్పుడే నేరస్తులకు భయం పుడుతుంది" అని ప్రశంసించారు.జాహెర్‌కు ప్రశంసా పత్రంతో



పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. నేరం జరుగుతున్నప్పుడు భయపడకుండా, మహమ్మద్ జాహెర్ లాగా ధైర్యంతో స్పందించి వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని నగరవాసులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కాగా, డబీర్‌పూరకు చెందిన రౌడీ షీటర్‌పై గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అతడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 16 కేసులున్నాయి.

# త్వరలో రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

**మొదటిపేజీ తరువాయి -** రైతుల సమస్యలు పరిష్కరిస్తామని, ఆ బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులు తీసుకుంటారని తెలిపారు." సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాతంగా పనిచేస్తున్న సంగతి మీకు తెలియంది కాదు. ఆనాటి ప్రభుత్వం ఏవైతే అరకొర పనులు చేస్తే వాటన్నింటిని కొనసాగిస్తునే ఉన్నాం. గత ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి పదేళ్లు పడితే ఈ ప్రజాప్రభుత్వంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 25 లక్షల రైతన్నలకు రూ.21 వేల కోట్లు ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల్లోనే మాఫీ చేశామన్న రెవెన్యూశాఖ పొంగులేటి మంత్రి శ్రీనివాస రెడ్డి.ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తూ ప్రభుత్వం రైతులను అరిగోసలు పెడుతుందని కేంద్ర హోంశాఖ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా తూకాలు వేయడం లేదని మండిపడ్డారు. కరీంనగర్ జిల్లా ఖాజీపూర్ వద్ద కొనుగోలు కేంద్రానికి వెళ్లిన బండి సంజయ్ రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు వస్తే ఇప్పటివరకు 15 లక్షల మెట్రిక్ టన్నులే కొన్నారని తెలిపారు. తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను అడ్డగోలుగా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. కల్లాల్లో వడ్లు పోసి కళ్లల్లో ఒత్తులేసుకొని చూస్తున్న రైతుల గోడును పట్టించుకొని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాల కూడలిలో ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ధర్నా చేశారు. కలెక్టర్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అటు రైతులు, ఇటు క్షేత్రస్థాయి అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. కింది స్థాయి నుంచి ఉన్నత పదవికి ఎదిగిన కలెక్టర్‌కు క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న



అవస్థలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగకపోతే కర్షకులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. అధికారులకు సరైన దిశా నిర్దేశం చేయడంలో కలెక్టర్ పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. రైతన్నల కష్టార్జితానికి గిట్టుబాటు ధర లభించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్టు సమాచారం. ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై విజ్ఞప్తులు చేయనున్నారు. పాలనాపరమైన అంశాలతో పాటు, ఏఐసీసీ అగ్రనేతలతో కూడా ముఖ్యమంత్రి సమావేశం కాబోతున్నారు.కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సాధించిన అఖండ విజయం ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించి, కూటమి విజయంలో తనవంతు కృషి చేశారు. ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతు ఒడగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు రేసులో బలంగా వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి, వేణుగోపాల్‌తో ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో, ఈ ఢిల్లీ పర్యటనలో కేరళ రాజకీయ సమీకరణాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది.

## ఇచ్చిన హామీలకు.. చేస్తున్న పనులకు పొంతన లేదు



**మొదటిపేజీ తరువాయి -** విరమణ పొందిన ఉద్యోగులకు ప్రయోజనాలు కల్పించడంలో, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. చివరికి న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థాయికి పరిస్థితి దిగజారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందక వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీత్కరించుకునే స్థితికి చేరుకుందని ధ్వజమెత్తారు.పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అహంకారానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని, తమిళనాడులో స్టాలిన్ వంటి బలమైన నేతపై ఒక సామాన్యుడు గెలిచాడంటే అక్కడి ప్రభుత్వాలపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందని విశ్లేషించారు. కుటుంబ రాజకీయాలు చేస్తూ, రాష్ట్రాన్ని తమ జాగీరుగా భావించే వారికి తమిళనాడు ఫలితాలు ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు. అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో గెలవాలనుకునే వారికి ఈ ఫలితాలు కనువిప్పు కావాలని... తెలంగాణ బాగుపడాలంటే బీజేపీ అధికారంలోకి రావడమే ఏకైక మార్గమని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.


# మమతా బెనర్జీ, రాహుల్ గాంధీ గతంలో ఓట్ చోరీ చేసే గెలిచారా?

**తెలంగాణ బీజేపీ చీఫ్ ప్రశ్న**

**ఈ నెల 10న రాష్ట్రానికి వచ్చే మోదీకి స్వాగతం పలకాలన్న బీజేపీ చీఫ్**

**ఓట్ చోరీ జరిగిందని మమతా బెనర్జీ అంటే, రాహుల్ సమర్థించడం విడ్డూరమని వ్యాఖ్య**

**ప్రజాస్వామ్యంలో ప్రజాతీర్పు సమర్థవంతమైనదన్న రామచందర్ రావు**



మమతా బెనర్జీ, రాహుల్ గాంధీలు గతంలో ఓట్ చోరీ చేసే ఎన్నికల్లో గెలిచారా? అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ప్రశ్నించారు. ఈరోజు హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ, యావత్ ప్రపంచం ఆర్థికమాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే మోదీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రగతి పథంపై పరుగులు పెడుతోందని అన్నారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలకాలని కోరారు.బెంగాల్‌లో 100 సీట్లలో ఓటు చోరీ జరిగిందని మమతా బెనర్జీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. వీళ్లకు ఓటు చోరీ అలవాటు కాబట్టే అప్పుడు గెలిచారని చురక అంటించారు. ఎన్నికల్లో ఓడిపోతే ప్రజల తీర్పును అంగీకరించాలని, కానీ ప్రజలను అవమానపరిచే మాటలు సరికాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు సర్వశక్తిమంతమైనదని అన్నారు.ప్రజాతీర్పును మమతా బెనర్జీ అవమానిస్తుంటే కాంగ్రెస్ మద్దతు తెలపడం విడ్డూరమని మండిపడ్డారు. మూడుసార్లు మమతా బెనర్జీ గెలిచినప్పుడు తాము ఏమీ అనలేదని, ప్రజాతీర్పును గౌరవించామని అన్నారు. కానీ వాళ్లు ఓడిపోతే మాత్రం ఈవీఎంలను తప్పుబడుతున్నారని మండిపడ్డారు. ఈసీఐని, దేశాన్ని నిందించడం ఏమిటని రామచందర్ రావు ప్రశ్నించారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# మంచి వరి విత్తనాలు వాడాలి

- వ్యవసాయ అధికారిణి డాక్టర్ దాసరి నవ్య




**మంథని, మే 05(వార్త సంధ్య) :** నేల పరిరక్షణ, సమీక్రుత ఎరువుల యాజమాన్యం, సహజ వ్యవసాయం, మెరుగైన విత్తనాలు వాడాలని మంథని వ్యవసాయ అధికారి డాక్టర్ దాసరి నవ్య తెలిపారు. మంగళవారం మంథని మండలం లోని సురయ్యపల్లి రైతు వేదికలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారం కార్యక్రమంలో రెండవ రోజు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త నరేష్ , ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ ఏఈ, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ ఎచ్ఈఓ , సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులతో నేల పరిరక్షణ కోసం ప్రమాణం తీసుకున్నారు. అలాగే రైతులకి నేల నమూనాలు ఎలా తీయాలి కూడా చూపించారు.

# పరిపూర్ణ సేవా సంస్థ సమ్మర్ క్యాంప్ ఘన ప్రారంభం...




**తిరువూరు,మే 05 (వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** తిరువూరు పట్టణం సూర్య ఫంక్షన్ హాల్ ప్రకన్న గల పరిపూర్ణ బాలల ఆశ్రమం నందు రాజుపేటలో చిన్నారుల్లో సృజనాత్మకత, మానసిక ఉల్లాసం పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ మొదటి రోజు ఘనంగా ప్రారంభమైంది. వేసవి సెలవుల్లో పిల్లలు ఎండలో తిరగకుండా, సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ఈ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మొదటి రోజు మల్లాది శ్రీలేఖ సహకారంతో రాజుపేటకు చెందిన పిల్లలు క్యారమ్ బోర్డు, మ్యాగ్నటిక్ డార్ట్ బోర్డు, హౌసీ గేమ్, చెస్, పెయింటింగ్ వంటి వివిధ ఆటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు ఆటల ద్వారా వినోదంతో పాటు సృజనాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా పరిపూర్ణ సేవా సంస్థ నిర్వాహకులు సిరికొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ, క్యాంప్‌లో నిర్వహించే వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు చివరి రోజు బహుమతులు అందజేస్తామని తెలిపారు.సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనాలనుకునే ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థులు తమను సంప్రదించాలని నిర్వాహకులు అయన సూచించారు.

# 1000 కోట్ల మైక్రో ఫైనాన్స్ కుంభకోణం ఆరోపణలు

భారీ ఆర్థిక వ్యవహారం పై దర్యాప్తు అవసరం

పేద, మధ్యతరగతి, గిరిజన వర్గాలపై తీవ్ర ప్రభావం

స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణకు డిమాండ్

నిజానిజాలు వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ !



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 05 (వార్త సంధ్య) :** రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్నట్లు ఆరోపణలు వెలువడుతున్న భారీ మైక్రో ఫైనాన్స్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో పలువురు ప్రముఖుల పేర్లు వినిపిస్తున్నాయని, బాధితులు తాము మోసపోయామని ఆరోపిస్తూ ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో కేసును స్వతంత్ర సంస్థ అయిన సీబీఐకి అప్పగించి నిజానిజాలు వెలికితీయాలని కోరారు. చుంచుపల్లి మండలంలోని సంఘం కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో మాట్లాడుతూ, ఈ ఘటనలో బాధితులు ఎక్కువగా పేద, మధ్యతరగతి, గిరిజన వర్గాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు సామాజికంగా ఆందోళన కలిగిస్తున్నాయని, బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, ఈ కేసులో పేర్లు వినిపిస్తున్న వారిపై పూర్తి స్థాయి విచారణ జరిపి, తప్పు నిరూపితమైతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. బాధితులకు ఆర్థిక పరిరక్షణ, చట్టపరమైన సహాయం అందించాలన్నారు. సమాజంలో నమ్మకం నిలబెట్టాలంటే ఇటువంటి అంశాలపై పారదర్శక విచారణ అత్యవసరమని, ఆలస్యం న్యాయాన్ని దూరం చేస్తుందని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో పలువురు సంఘ నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని, బాధితులకు మద్దతు తెలిపారు.

# టాప్ మార్కులతో మెరిసిన శ్రీ చైతన్య విద్యార్థులు

భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఎమ్మెల్యే పాయం చేతుల మీదుగా ఘన సత్కారం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 05 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు బ్రాంచ్ కు చెందిన విద్యార్థులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్లో ఎ. గేయశ్రీ 578 మార్కులతో ప్రథమ స్థానం, పూల కుమారి మరియు వాణి అక్షయ తలా 575 మార్కులతో తదుపరి స్థానాలు, సహస్ర 570 మార్కులతో ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల విజయాన్ని అభినందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారికి శాలువాలు కప్పి సత్కరించారు. కష్టపడి చదివితే మరింత ఉన్నత స్థానాలు సాధించవచ్చని, భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షాహిన్, వైస్ ప్రిన్సిపాల్ మహమ్మద్, సి ఇన్‌చార్జ్ కొమరయ్య, 10వ తరగతి ఇన్‌చార్జ్ నరేష్ కుమార్, ఉపాధ్యాయులు, యువజన కాంగ్రెస్ నాయకులు కోర్స ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి లేకుండా చర్యలు...

# నూతన బోరు ప్రారంభించిన సర్పంచ్ చిందం మహేష్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 05( వార్త సంధ్య) :** రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ లో సర్పంచ్ చిందం మహేష్ వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా గ్రామంలో నూతన బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భూక్యా ప్రేమలత, వార్డు సభ్యులు తన్నీరు ప్రదీప్, కుంట విజయ్ కుమార్, మొతుకూరి స్వప్న, ఎండీ నూర్జహాన్, నాగుల రమాదేవి, గౌడ వైష్ణవి,భాస్కరి అరుణ , తాండ్ర ప్రశాంత్, కలువల రఘుపతి, బండి అరుణ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

ఏపీ నుంచి తెలంగాణకు ఇసుక స్మగ్లింగ్

ముగ్గురు నిందితులు అరెస్ట్ రిమాండు కు తరలింపు

కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 05 (వార్త సంధ్య) :** ఖమ్మం జిల్లా కల్లూరు డివిజన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. వ్యవస్థీకృతంగా ఇసుకను ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు తరలిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను వియం బంజారా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ వెల్లడించారు. గత నెల 25న వియం బంజారా ఎస్సై వెంకటేష్ సిబ్బందితో కలిసి రింగ్ సెంటర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, తిరువూరు వైపు నుంచి వస్తున్న ఏపీ39జెడ్0396 నంబర్ టిప్పర్ లారీని ఆపి తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న ఇసుకను గుర్తించారు. వెంటనే లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితులపై దృష్టి సారించిన పోలీసులు మంగళవారం వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇదే లారీపై గతంలో కూడా వియం బంజారా పోలీస్ స్టేషన్‌లో కేసు (203/2025, సెక్షన్ 318(4) బీఎన్ఎస్) నమోదు అయినట్లు తెలిపారు. అరెస్టైన నిందితులు ఏలూరు జిల్లా (ఏపీ)కు చెందిన పసుపులేటి పవన్ కుమార్ (27, డ్రైవర్), వెల్లంకి త్రినాథ రామకృష్ణ (50, లారీ యజమాని), అబ్బూరి రఘు (33, మధ్యవర్తి)గా గుర్తించారు. కల్లూరు డివిజన్‌లో అక్రమ రవాణాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. అవసరమైతే సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు.

# వాణిజ్య పంటలతో రైతులకు ఆర్థిక భరోసా

పంటల విభిన్నీకరణతోనే లాభదాయక వ్యవసాయం

ఆధునిక సాంకేతికత వినియోగంపై రైతులకు సూచనలు

ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రాధాన్యం

నీటి సంరక్షణతో ఖర్చు తగ్గింపు, లాభాల పెంపు

కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 05 (వార్త సంధ్య) :** రైతులు కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు సూచించారు. జిల్లా చుంచుపల్లి మండలంలోని భువన గార్డెన్స్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు నిర్వహించిన "ఉద్యాన పంటల సాగు" అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు పంటల విభిన్నీకరణ చేపట్టి మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగు విస్తరణ ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ ఆటోమేషన్, సిరికల్చర్, ఆయిల్ పామ్ స్టాళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ఆసక్తిగా వివరాలు తెలుసుకున్నారు. నీటి సంరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి, లాభాలు పెరుగుతాయని చెప్పారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. నిపుణులు సూచించిన సాగు మెళకువలను పాటిస్తే రైతులు ఆర్థికంగా మరింత బలపడతారని పేర్కొన్నారు. అధికారులు ఆయిల్ పామ్ సాగు విస్తరణకు సంబంధించిన ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జె. కిషోర్, ఉద్యాన అధికారి డి. దేవప్రసాద్, హెచ్.ఈ.ఓ వసంత, టిపిసిఎస్ అధ్యక్షులు మండే హనుమంత రావు, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా "అంగారక చతుర్థి" వేడుకలు

-గణనాథున్ని దర్శించుకుని పునీతుడైన భక్తులు



**మంథని, మే 05(వార్త సంధ్య) :** శ్రీ గణనాథుని పూజిస్తే అంతా శుభం జరుగుతుంది. అంగారక సంకష్టహర చతుర్థి సందర్భంగా మంగళవారం గణనాథుని ఆలయాలు భక్తులతో పండుగ వాతావరణం నెలకొంది. దైనందిన జీవితంలో మానవులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ సంకష్టహర చతుర్థి దీక్షతో తొలగిపోతాయని శాస్త్రాల్లో చెప్పబడింది. కొత్తగా చతుర్థి దీక్ష తీసుకునేవారు అంగారక చతుర్థి రోజున దీక్ష తీసుకోవడం ఎంతో శ్రేయస్కారం. ప్రతి మనిషి తన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధికమించడానికి సంకష్టహర చతుర్థి రోజున ఉపవాస దీక్ష చేపట్టడం అనాదిగా పాటిస్తున్న నియమం. సంకష్టహర చతుర్థి రోజున శ్రీ విఘ్నేశ్వరుని పూజించి ఆలయంలో 21 ప్రదక్షిణాలు చేసి మోదకులు ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే అన్ని సంకటాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రావణమాసంలో వచ్చిన అంగారక చతుర్థి ఎంతో విశిష్టమైనది. మంథని పట్టణంలోని శ్రీ మహా గణపతి దేవాలయంలో సిద్ధి, బుద్ధి సమేతంగా కొలువుతీరిన గణనాథున్ని సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గణపతికి ఇష్టమైన వారం మంగళవారం అలాగే నవగ్రహాల్లోని కుజ గ్రహ దోషం పోవాలన్న మంగళవారం వచ్చే అంగారక చతుర్థి రోజున "ఓం గం గణపతియై నమః " అని స్మరిస్తూ విఘ్నేశ్వరున్ని దర్శించుకుంటే అన్ని సంకటాలు తొలగిపోతాయి. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి రోజున సంకష్టహర చతుర్థి వస్తుంది ఏడాదిలో ఒకసారి మంగళవారం వచ్చే చతుర్థి ని అంగారక అంటారు. ఈ రోజున రాత్రి 9 గంటలకు చంద్రోదయం అనంతరం స్వామివారికి పూజ చేసి భోజనం చేయడం ఎంతో శ్రేయస్కారం. ఈ రోజున ఉపవాస దీక్ష స్వీకరిస్తే జీవితంలో ఎదుర్కొంటున్న విఘ్నాలన్ని తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా శ్రీ మహాగణపతి దేవాలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. దేవతలలో మొట్టమొదట పూజించబడే ఎంతో విశిష్టత కలిగిన శ్రీ విఘ్నేశ్వరున్ని పూజించడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోయి అంతా శుభం జరుగుతుందనే విశ్వాసంతో సంకష్టహర చతుర్థి దీక్షను స్వీకరిస్తారు. ఈ రోజున విఘ్నేశ్వరునికి ఇష్టమైన గరిక ( దూర్వాలు ) సమర్పించడం అలాగే 21 ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే విఘ్నేశ్వరునికి ప్రీతిపాత్రలవుతారు అని శాస్త్రాల్లో పేర్కొనబడింది. ఈ రోజున చంద్రోదయం అనంతరం భోజనం చేయడం ఈ దీక్షలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఆలయ పూజారి పల్లి రాము భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

# సబ్ రిజిస్ట్రార్ పేరుతో వసూళ్లు.. ప్రైవేట్ డ్రైవర్ అరెస్ట్

ఏసీబీ డిఎస్పీ వై. రమేష్ చర్యలు

తన ఖాతా ద్వారా డబ్బుల లావాదేవీలు

గత తనిఖీల్లో బయటపడ్డ అవకతవకలు

మరిన్ని అరెస్టులకు అవకాశం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 05 (వార్త సంధ్య) :** సబ్ రిజిస్ట్రార్ పేరుతో డబ్బులు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడిన ప్రైవేట్ డ్రైవర్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. బూర్గంపహాడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించిన ప్రైవేట్ డ్రైవర్ ఫహీంను ఖమ్మంలో ఏసీబీ డిఎస్పీ వై. రమేష్ అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం, ఫహీం ప్రజల నుంచి సబ్ రిజిస్ట్రార్ పేరుతో డబ్బులు వసూలు చేసి ముందుగా తన ఖాతాలో వేయించుకుని, అనంతరం వాటిని సబ్ రిజిస్ట్రార్ ఖాతాలో జమ చేస్తున్నట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటికే బూర్గంపహాడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో గత ఏడాది జూన్‌లో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీల్లో అవకతవకలు బయటపడటంతో అప్పట్లో అక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ ఖదీర్‌ను కూడా అరెస్ట్ చేశారు. ఫోన్ కాల్స్, డబ్బుల లావాదేవీల ఆధారాలను సేకరించారు. తాజాగా ఫహీంను అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించారు. గతంలో వివిధ శాఖల్లో జరిగిన ఆకస్మిక తనిఖీల్లో బయటపడిన అక్రమాల ఆధారంగా త్వరలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, కొన్ని శాఖల్లో ప్రైవేట్ డ్రైవర్లు, డ్రైవర్ల ద్వారా అవినీతి కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు - అధిక యూరియానీ తగ్గించాలి



**మంథని, మే 05(వార్త సంధ్య) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంథని మండలం కన్నాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ్ కుమార్ పాల్గొని రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం అధిక యూరియా వాడకంని తగ్గించాలి, అవసరానికి మించి పురుగుమందు వాడటం వల్ల జరిగే నష్టాలని రైతులకి క్షుణ్ణంగా వివరించారు. అలాగే విశ్వవిద్యాలయం నుండి రూపొందించిన వివిధ వరి రకాల వంగడాల గురించి వివరించి వాటి యొక్క లాభాలను రైతులకి తెలియజేశారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అధికారి డాక్టర్ నవ్య మరియు వ్యవసాయ విస్తారణ అధికారి స్రవంతి, గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య మరియు పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.

# పాల్వంచ మండలం పాల్వంచ గ్రామం పీపీసీని సందర్శించిన జిల్లా కలెక్టర్ పీఏసీఎస్ మాచారెడ్డి పరిధిలో కొనసాగుతున్న పాల్వంచ పీపీసీ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా కేంద్రంలో వరి కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుండగా,

ఒక లారీ లోడింగ్ పూర్తయినట్లు పరిశీలించారు.



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 5 ( వార్త సంధ్య ) :** జిల్లా కలెక్టర్ డీసీవో, డీఎంసీఎస్, డీసీఎస్ఓ అధికారులకు తూకం ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతుల ధాన్యం త్వరితగతిన కొనుగోలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సరిపడా రవాణా సౌకర్యాలు కల్పించి, రైస్ మిల్లుల వద్ద వాహనాల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పీపీసీల వద్ద అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, వరి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. వరి కొనుగోలు పూర్తిగా ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం చేపట్టాలని, ధాన్యసేతు యాప్‌లో కొనుగోలు వివరాలను నమోదు చేయాలని, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. అలాగే కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని తరలించాలని, అన్‌లోడింగ్ అనంతరం వెంటనే ట్రక్ చిట్స్ తీసుకురావాలని, ట్యాబ్ ఎంట్రీలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. తూకం వేసిన ధాన్యం, ధాన్య కుప్పలను వర్షాల నుండి రక్షించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీవో, డీసీఎస్ఓ, డీఎంసీఎస్, ఎంఎస్ఓ, ఫీల్డ్ ఆఫీసర్, తహసీల్దార్, డీటీసీఎస్, ఏఈఓ, సర్పంచ్, కార్యదర్శి, పీపీసీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అశ్వాపురం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 05 (వార్త సంధ్య) :** అశ్వాపురం మండలానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు సుమారు లక్ష రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అవసర సమయంలో ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించే ఆర్థిక సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పంట కొనుగోళ్లు,నిల్వలు, రవాణాపై సమగ్ర సమీక్ష**

**వేడిగాలుల నేపథ్యంలో కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలి**

**ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 05 (వార్త సంధ్య) :** ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ ఐకేపీ ,మంథని లోని గంగపురి ఐకెపి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా కేంద్రానికి వచ్చిన పంట పరిమాణం, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,తేమ ఉన్న పంటను వెంటనే కొనుగోలు చేసి మిల్లర్లకు త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రంలో అవసరమైన తార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలని,గన్నీ బ్యాగుల సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.వేడిగాలుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్రంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.రవాణా వాహనాలు, హమాలీల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ యాకన్న,మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్,ఏడిఏ అంజని, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**మిషన్ భగీరథలో అంతరాయం కలిగితే తక్షణ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

**సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 05( వార్త సంధ్య) :** వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం సమగ్ర జిల్లా కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరా,వేసవి యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం కలిగితే వెంటనే స్థానిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు నీటి కొరతతో ఒత్తిడికి గురికాకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.కొత్త గృహ కనెక్షన్లను గ్రామ పంచాయతీ నిధుల ద్వారా వేగంగా మంజూరు చేయాలని తెలిపారు. పైప్‌లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేసి నీటి వృథా నివారించాలన్నారు. ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకుల చిన్నపాటి మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఇందిరమ్మ హౌసింగ్ పథకం పురోగతిని వేగవంతం చేయాలని, లబ్ధిదారులందరిని సంప్రదించి గృహ నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని తెలిపారు. నిర్మాణ పురోగతిని బట్టి బిల్లులు చెల్లించడంతో పాటు అవసరమైన నమోదు వివరాలను సమయానుసారం నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ పూర్ణ చంద్రర్, ఇంట్రా ఈఈ శ్రీనివాస్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీవోలు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కామారెడ్డి లో 2026 బి27 సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభించబడినవి

**మరియు ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇంప్రూవ్మెంట్ రాసే విద్యార్థులకు ప్రత్యేక తరగతులను కూడా నిర్వహిస్తున్నారు**




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 5 ( వార్త సంధ్య) :** పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాల కామారెడ్డి యందు అడ్మిషన్స్ తీసుకోగలరని కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి జయకుమారి తెలియజేశారు ఉచిత విద్య కళాశాలలో అందించబడును మరియు విద్యార్థులందరికీ ఉచిత పుస్తకాలు అందజేయబడును కళాశాలలో ఎంపీసీ, బైపిసి సిఇసి హెచ్ఇసిసి తెలుగు,ఇంగ్లీష్,ఉర్దూ మీడియం లో కళాశాల యందు సీట్లు కలవు మరియు ఒకేషనల్ కోర్సులు ఎం పి హెచ్ డబ్ల్యు ఎం ఎల్ టి మరియు ఏసీఈ కోర్సులు కూడా నిర్వహించబడుతున్నాయి కావున విద్యార్థులందరూ కూడా కళాశాలకు హాజరై అడ్మిషన్స్ తీసుకోగలరు

# కార్మికులు కార్మిక శాఖ గుర్తింపు కార్డులు పొందాలి..

**మున్సిపల్ చైర్మన్ కట్కం రవి**



**రాయికల్ మండల మే 5( వార్త సంధ్య) :** అసంఘటిత కార్మికులు తప్పని సరిగా తమ వివరాలు నమోదు చేసుకుని లేబర్ కార్డు పొందాలని, తద్వారా ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ అన్నారు.. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మెట్ పల్లి కార్మిక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో లేబర్ కార్డుల నమోదు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.. ఈనెల 10 వరకు మండల కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మెట్ పల్లి అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారి కృష్ణ సాగర్ అన్నారు.. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూక్యా రాకేష్ నాయక్, పుర్రె శ్రీధర్, నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి ,మచ్చ శేఖర్, తోపరపు సురేష్, వేముల రాము,వాసం రాజేంధర్,ఎనుగందుల లింగం,అలీ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో చీరల పంపిణీ కార్యక్రమం



**కామారెడ్డి, మే 5 (వార్త సంధ్య ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 38వ వార్డులో "ఇందిరమ్మ మహిళా శక్తి" పథకం కింద చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వార్డులోని అర్హులైన మహిళలకు ఆమె చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకునే మహిళలు తమ ఆధార్ కార్డు మరియు రేషన్ కార్డులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యూనస్, సిద్దిక్, స్థానిక సీనియర్ నాయకులు చాట్ల రాజేశ్వర్, గొనె శ్రీనివాస్, నాగరాణి, అధికారులు, రాజకీయ పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

# బ్యాంకులు,ఏటీఎం లలో భద్రత కట్టుదిట్టం అనుమానితులపై ప్రత్యేక నిఘా





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, గోదావరిఖని, మే 05( వార్త సంధ్య) :** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలోని బ్యాంకులు మరియు ఏటీఎం కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించబడినట్లు గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. ఆయన పర్యవేక్షణలో గోదావరిఖని1, 2 టౌన్,రామగుండం సర్కిల్, మంథని సర్కిల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల్లో పోలీస్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో గోదావరిఖని1 టౌన్ ఇన్‌స్పెక్టర్లు ఇంద్రసేనారెడ్డి, అఫ్జలోద్దీన్,2 టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు,మంథని సీఐ రాజు,రామగుండం సీఐ కృష్ణకుమార్‌లు, మరియు ఎస్ఐలు పాల్గొ న్నారు. తనిఖీల సందర్భంగా అనుమా నాస్పద వ్యక్తులను గుర్తించి వారి వివరాలను సేకరించారు. నేర నియంత్రణలో భాగంగా బ్యాంకులు మరియు ఏటీఎం కేంద్రాల్లో అలారం వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలిం చాలని,హై రిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి నిరం తరం పనిచేసేలా చూసుకోవాలని సూచించారు.సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను కూడా పరిశీలించారు. ఏదైనా నేరం జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా నిందితులను సులభంగా గుర్తించవచ్చని, అలాగే అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడానికి వీటి ఉపయోగం ఎంతో ఉంటుందని పోలీస్ అధికారులు బ్యాంకు నిర్వాహకులకు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బ్యాంకుల భద్రత కోసం సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు, సరిపడా లైటింగ్, సెక్యూరిటీ గార్డుల ఏర్పాటు వంటి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. బ్యాంకు ఆవరణ మొత్తం కవరయ్యేలా కెమెరాలు ఏర్పాటు చేయాలని ,స్ట్రాంగ్ రూమ్ భద్రతను కచ్చితంగా పాటించాలని తెలిపారు. అలాగే బ్యాంకులకు వచ్చే కస్టమర్లలో ఎవరైనా అనుమానాస్పదంగా ఎక్కువసేపు ఉన్నట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బ్యాంకు నుండి నగదు ఉపసంహరించుకుని వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా కస్టమర్లకు అవగాహన కల్పించాలని బ్యాంకు అధికారులకు సూచించారు.

# హైడ్రా భారీ ఆపరేషన్ - ఒకేరోజు 6 ప్రాంతాల్లో దాడులు

**6 క్రషింగ్ యూనిట్లు, 12 ఆర్ఎంసీ ప్లాంట్లు నేలమట్టం**

**అక్రమ మైనింగ్‌పై హైడ్రా కఠిన చర్యలు**

**ఒకేరోజు 6 ప్రాంతాల్లో హైడ్రా ఆపరేషన్లు**

**6 క్రషింగ్ యూనిట్లు, 12 ఆర్ఎంసీ ప్లాంట్ల తొలగింపు**

**సంబంధిత శాఖల ఫిర్యాదు మేరకు చర్యలు**



హైదరాబాద్‌లో అక్రమ మైనింగ్‌పై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న స్టోన్ క్రషింగ్, ఆర్ఎంసీ యూనిట్లపై భారీ స్థాయిలో చర్యలు చేపట్టింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైనింగ్, రెవెన్యూ శాఖల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన హైడ్రా, ఒకే రోజు 6 ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 6 క్రషింగ్ యూనిట్లతో పాటు, 12 ఆర్ఎంసీ ప్లాంట్లను తొలగించింది. భవిషత్తులో ఆ ప్రాంతాల్లో స్టోన్ క్రషింగ్ చేయడానికి వీలు లేకుండా యంత్ర సామగ్రిని ధ్వంసం చేసింది. రూ.వందల కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందన్న సంబంధిత శాఖల ఫిర్యాదుల మేరకు పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమ మైనింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టింది.హైడ్రా మంగళవారం భారీ ఆపరేషన్ చేపట్టింది. అనుమతులు లేకుండా మైనింగ్, క్రషింగ్, ఆర్ఎంసీ యూనిట్లను నడుపుతున్న వారిపై చర్యలకు దిగింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైనింగ్ శాఖల నుంచి ఫిర్యాదు అందగానే రంగంలోకి దిగిన హైడ్రా, ఈరోజు ఉదయం ఒకేసారి 6 ప్రాంతాల్లో బుల్డోజర్లతో దాడులు చేసి అక్రమ మైనింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టింది. 12 ఆర్ఎంసీ ప్లాంట్లను తొలగించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లి, శేరిలింగంపల్లి మండలంలోని గౌలిదొడ్డి, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ ప్రాంతాల్లో ఈ దాడులు చేసింది. ఇష్టానుసారం క్వారీలు తవ్వి, స్టోన్ క్రషింగ్‌తో దుమ్ము రేపి, పరిసరాలను నాశనం చేసే వారిపై హైడ్రా చర్యలు తీసుకుంది. విపరీతమైన దుమ్ముతో వాతావరణాన్ని కాలుష్యం చేయడాన్ని నియంత్రించింది. బండ రాళ్లను పేల్చి పరిసర ప్రాంతాల్లోని నివాసాలకు ముప్పుగా పరిణమించిన అక్రమ మైనింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టిన హైడ్రా, 6 చోట్ల స్టోన్ క్రషింగ్ యూనిట్లను నేల కూల్చింది. భవిష్యత్తులో అక్కడ స్టోన్ క్రషింగ్ చేయడానికి వీలు లేకుండా యంత్ర సామగ్రిని తొలగించింది. గతంలో మైనింగ్, పీసీబీ శాఖల హెచ్చరికలను పట్టించుకోకుండా యథేచ్ఛగా సాగుతున్న అక్రమ మైనింగ్‌కు హైడ్రా మంగళవారం శాశ్వతంగా చెక్ పెట్టింది.రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగుల పల్లి, శేరిలింగంపల్లి మండలంలోని గౌలిదొడ్డి, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారంతా బడా సంస్థలకు చెందిన వారే కావడం గమనార్హం.అక్రమ మైనింగ్ జరుగుతున్న యూనిట్లను డిస్మాంటల్ చేయమని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హైడ్రాకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మైనింగ్‌కు పాల్పడుతున్న యూనిట్లను తొలగించాలని కోరారు. గౌలిదొడ్డిలో గ్రేట్ ఇండియా మైనింగ్ సంస్థ, వట్టినాగులపల్లిలోని మూడు చోట్ల పరమేశ్ సింగ్ స్టోన్ క్రషర్, శ్రీ లక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్, పృథ్వీ స్టోన్ క్రషర్, కొత్వాల్‌గూడలో స్టోన్ క్రషర్ సంస్థలు అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డాయి. ఈ సంస్థలకు తోడు మక్తా భగత్‌సింగ్ అనే వ్యక్తి స్టోన్ క్రషింగ్‌ను పెద్దఎత్తున చేపట్టారు.ఈ సంస్థలు అక్రమ మైనింగ్, క్రషింగ్ యూనిట్లతో రూ.వందల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. రూ.కోట్లలో కరెంట్ బిల్లులు బకాయిలు ఉండటంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తే డీజిల్‌తో యూనిట్లను నడిపిస్తున్నారు. ఈ పరిణామాలతో పాటు మైనింగ్, పీసీబీ అనుమతులు లేకుండా యూనిట్లు నడపడంతో రంగారెడ్డి కలెక్టర్ లేఖ రాయగా హైడ్రా చర్యలు చేపట్టింది. కాలుష్య కారక యూనిట్ల తొలగింపుతో పరిసర ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.కొత్వాల్‌గూడలో క్రషింగ్ యూనిట్ల తొలగింపుపై హైడ్రా కమిషనర్ వివరణ ఇచ్చారు. కొత్వాల్‌గూడలో తొలగించిన క్రషింగ్ యూనిట్ తిరుమల మెటల్ ఇండస్ట్రీకి చెందినదని స్పష్టం

# హైదరాబాద్‌లో మరో 3 కొత్త ఎంఎంటీఎస్ స్టేషన్లు

**ఎక్కడెక్కడ రానున్నాయంటే?**

**లయోలా కాలేజ్ దగ్గర స్టేషన్ నిర్మించాలని పదేళ్ల కిందటే ప్రణాళిక**

**ఆనంద్‌బాగ్‌లో స్టేషన్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు తప్పనున్న ఇబ్బందులు**

**మౌలాలీలో నిర్మాణంతో 2 వేల మందికి రైల్వే సేవలు**



ఆనంద్‌బాగ్, మౌలాలీ, అల్వాల్ లయోలా కాలేజీ దగ్గర ఎంఎంటీఎస్ సేవలు కావాలన్న ప్రయాణికుల డిమాండ్లు త్వరలో నెరవేరనున్నాయి. ఈ 3 ప్రాంతాల్లో కొత్త ఎంఎంటీఎస్ స్టేషన్లు రాబోతున్నాయి. ఇందుకు సంబంధించి ప్రతిపాదిత అంశాలను రైల్వే బోర్డు ఆమోదం కోసం దక్షిణ మధ్య రైల్వే యంత్రాంగం పంపింది. త్వరలోనే దీనిపై ఓ స్పష్టమైన ప్రకటన వెలువడనుంది.ఘట్‌కేసర్, సనత్‌నగర్ మధ్య ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకల కోసం కొత్త రైల్వేస్టేషన్ల అవసరం చాలా పెరిగింది. పదేళ్ల క్రితమే ఈ సెక్షన్‌లో ఆరు కొత్త స్టేషన్లు నిర్మించాలని ప్రణాళికలు ఉన్నాయి. అయితే ఈ విషయంపై ప్రయాణికులు, పలు కుల సంఘాలు డివిజనల్ రైల్వే మేనేజర్‌కు దరఖాస్తు చేశాయి. ఆ కళాశాల లెవెల్ క్రాసింగ్‌ను పరిశీలించి నిర్మాణం సాధ్యమా? కాదా? అని అంచనా వేశారు. అనంతరం నివేదికను ప్రధాన కార్యాలయానికి సమర్పించారు.సబర్బన్ ప్రాంతంలో కనీసం రెండు కిలోమీటర్లకు ఒక స్టేషన్ ఉండాలి. కానీ చర్లపల్లి నుంచి నేరెడ్‌మెట్ వరకు ఒక్క స్టేషన్ కూడా లేదు. మల్కాజిగిరి ప్రజలు చర్లపల్లి, నిజామాబాద్ మార్గంలో వెళ్లే రైళ్లలో ప్రయాణించాలంటే నేరెడ్‌మెట్, చర్లపల్లి స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఆనంద్‌బాగ్‌లో స్టేషన్ ఏర్పాటు జరిగితే రైలు ప్రయాణికులకు అవస్థలు తప్పే అవకాశం ఉంది.మౌలాలీలోని రైల్వే క్వార్టర్స్ దగ్గర రెండు వేల కుటుంబాలున్నాయి. ఇక్కడే ఒక స్టేషన్ నిర్మించినట్లయితే ఈ నివాసితులంతా ఆ ఎంఎంటీఎస్ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంది.

**ఎంఎంటీఎస్‌లో ప్రయాణించడం వల్ల కలిగే ప్రయోజనాలు :**


ఎంఎంటీఎస్ ప్రయాణం చేయడం వల్ల తక్కువ ఖర్చుతో అయిపోతుంది. బస్సులు, మెట్రోతో పోల్చితే వీటి ధర చాలా తక్కువగా ఉంటుంది.తెలంగాణ ప్రభుత్వం ఎంఎంటీఎస్‌లో ప్రయాణాలు ప్రోత్సహించడం కోసం ఒక సంవత్సరం పాటుగా మహిళలు, పురుషులకు ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని అందించాలని యోచిస్తోంది.వాహనాలపై ప్రయాణంతో పోలిస్తే ఇది కాస్త సుఖంగా ఉంటుంది. ఎందుకంటే ట్రాఫిక్ సమస్యలు ఏమీ ఉండవు. హైదరాబాద్, సికింద్రాబాద్, లింగంపల్లి, ఫలక్‌నుమా, మేడ్చల్, ఉమ్దానగర్ వంటి ప్రాంతాల్లో అనుసంధానమై ఉంటుంది.కొత్తగా అల్వాల్, ఆనంద్‌బాగ్, మౌలాలీలో స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.విద్యుత్ సరఫరాతో నడుస్తుంది. అందువల్ల ఎలాంటి వాహనాల కాలుష్యం ఉండదు.ఎంఎంటీఎస్ ద్వారా ఎక్కువగా ఐటీ ఉద్యోగులకు ప్రయోజనం ఉంటుంది. హైటెక్ సిటీ, లింగంపల్లి వైపు వెళ్లే వారు తక్కువ రద్దీతో వెళ్లవచ్చు.సమయాన్ని ఆదా చేయగలిగే అవకాశం ఉంది. 'రైల్‌వన్' యాప్ ద్వారా ట్రైన్ సమయాలు ముందుగానే తెలుసుకోవడం వల్ల ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారుతుంది.ఎందుకు ఎంఎంటీఎస్‌లో ప్రయాణికుల సంఖ్య తగ్గిందంటే : ఒకప్పుడు ఎంఎంటీఎస్‌లో రోజుకు సుమారు 1.5 లక్షల మంది ప్రయాణించే వారు. ప్రస్తుతం అది 50 వేల మందికి తగ్గిపోయింది. సమయ పాలనపై ఉన్న అనుమానాలు ఇందుకు కారణమని చెబుతున్నారు. ట్రైన్లు ఆలస్యంగా వస్తాయని భావించి చాలా మంది ఈ సేవలను ఉపయోగించకుండా దూరమయ్యారు. అయితే ఈ అభిప్రాయాన్ని మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. ఇందుకోసం రైల్‌వన్ యాప్ తీసుకొచ్చింది.

# బంగాల్ నుంచి మమతా బెనర్జీ నన్ను పూర్తిగా బహిష్కరించారు

**కశ్మీర్ ఫైల్స్ డైరెక్టర్**

**మమతా బెనర్జీ నన్ను బంగాల్‌లో అడుగు పెట్టనివ్వనని అన్నారన్న వివేక్ అగ్నిహోత్రి**

**గవర్నర్ నుంచి అవార్డు తీసుకోవడానికి కూడా బంగాల్ వెళ్లలేకపోయానన్న డైరెక్టర్**




తనను బంగాల్‌లో అడుగు పెట్టనివ్వనని మమతా బెనర్జీ అన్నారని దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి ఆరోపించారు. తాను దర్శకత్వం వహించిన 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రాన్ని కూడా ఆమె అడ్డుకున్నారని అన్నారు. ఆ తర్వాత బంగాల్ నుంచి బహిష్కరించారని తెలిపారు. బంగాల్ ఎన్నికల్లో మమతా బెనర్జీ అధికారం కోల్పోయిన తర్వాత వివేక్ అగ్నిహోత్రి స్పందించి మమతపై కీలక వ్యాఖ్యలు చేశారు.తాజాగా వెలువడిన బంగాల్ ఎన్నికల ఫలితాల్లో మమతా బెనర్జీకి గట్టి షాక్ తగిలింది. ఈ ఫలితాల అనంతరం 'ఎవరికీ తెలియని కొన్ని విషయాలు' అంటూ వివేక్ ఓ వీడియో విడుదల చేశారు. అందులో ఆయన ఏం చెప్పారంటే ఇకపై ఇలాంటివి జరగకూడదు. 'ది కశ్మీర్ ఫైల్స్' విడుదలైన తర్వాత బంగాల్ నుంచి మమతా బెనర్జీ నన్ను పూర్తిగా బహిష్కరించారు. ఆ సినిమాను థియేటర్ల నుంచి తొలగించడమే కాకుండా నన్ను బంగాల్‌లో అడుగుపెట్టనివ్వనని అన్నారు. 'అలాగే 'ది బంగాల్ ఫైల్స్' చిత్రాన్ని ఆమె బంగాల్‌లో పూర్తిగా నిషేధించారు. మా సినిమా ట్రైలర్ లాంచ్‌ను అడ్డుకున్నారు. మాపై దాడులు జరిగాయి. నాపై డజన్ల కొద్ది ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. నన్ను బంగాల్‌లో ఏ కార్యక్రమానికి పిలవకుండా చేశారు. చివరకు గవర్నర్ నుంచి అవార్డు తీసుకోవడానికి కూడా నేను వెళ్లలేకపోయాను. అయినా మేము ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. ఈ ఎన్నికల సమయంలో 'ది బంగాల్ ఫైల్స్' చిత్రాన్ని బంగాల్ వ్యాప్తంగా సాధ్యమైనంత ఎక్కువ మందికి రహస్యంగా చూపించాం. మేము వెనకడుగు వేయకుండా మా శక్తి మేరకు పోరాడినందుకు నాకు సంతోషంగా ఉంది. మా కష్టానికి తగిన ఫలం దక్కింది. గొప్ప విజయం వరించింది' అని వివేక్ ఆ వీడియోలో పేర్కొన్నారు. ఇకపై బంగాల్ ప్రజలు ఎలాంటి భయం లేకుండా తలెత్తి గర్వంగా నడవొచ్చని ఆయన అన్నారు. బంగాల్‌ను అప్రతిహతంగా 15 ఏళ్లు పాలించిన మమతా బెనర్జీకి ఈసారి రాజకీయంగా గట్టి ఎదురు దెబ్బ తగిలింది. బంగాల్‌లో తిరుగులేని శక్తిగా కొనసాగాలని, జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారాలనుకున్న ఆమె ప్రయత్నాలకు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అడ్డుకట్ట వేసింది. ప్రస్తుతానికి బంగాల్‌లో దీదీ (అక్క) శకం ముగిసినట్లేనా అనే ప్రశ్న తలెత్తుతుంది. కారణం మళ్లీ అసెంబ్లీ ఎన్నికల నాటికి ఆమెకు 76 ఏళ్లు వస్తాయి.అందరికీ దీదీగా సుపరిచితురాలైన మమతా బెనర్జీ భావోద్వేగ రాజకీయాలు చేశారు. బంగాల్ రాజకీయాల్లో ఆమె అందుకున్న స్థానాన్ని ఏ ప్రత్యర్థీ అందుకోలేకపోయారు. ఆమె ఆచితూచి స్పందించే నేత కాదు. వ్యవస్థాగతపరంగానూ ఆలోచించే వ్యకి కాదు. చైతన్యవంతమైన, భావోద్వేగపూరితమైన నేతగానే కొనసాగారు. ఆమె డ్రాయింగ్ రూంల నుంచి, టీవీ స్టూడియోల నుంచి ఎదిగిన నేత కాదు. రైలు పట్టాలు, నిరసన ప్రదర్శనలు, వీధి పోరాటాలు, నిరాహార దీక్షలతో ఎదిగారు. ఎవరూ వెళ్లడానికి సాహసించని హింసాత్మక ఘటనలు జరిగే గ్రామాలకు ఆమె భయపడకుండా వెళ్లేవారు. విషాదాలు జరిగినప్పుడు ఆసుపత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించేవారు. సాధారణ కార్మికులతో కలిసి ధర్నాల్లో కూర్చునేవారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడానికి ముందే ఆమె దీదీగా ప్రసిద్ధి చెందారు.

# నిజాయతీకి నిలువుటద్దం.. పొరపాటున వచ్చిన రూ.10 వేలు తిరిగిచ్చిన ఉబెర్ డ్రైవర్!

**పొరపాటున తన ఖాతాలో పడిన రూ.10 వేలను టెక్కీకి తిరిగిచ్చిన ఉబెర్ డ్రైవర్**

**ఒడిశాలోని భువనేశ్వర్‌లో వెలుగు చూసిన స్ఫూర్తిదాయక ఘటన**

**డ్రైవర్ నిజాయతీని వివరిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్**

**సోషల్ మీడియాలో వైరల్ అయిన పోస్ట్.. డ్రైవర్‌పై నెటిజన్ల ప్రశంసలు**




ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ స్కామ్‌లు సర్వసాధారణమైపోయిన ఈ రోజుల్లో నిజాయతీకి మారుపేరుగా నిలిచాడో ఉబెర్ డ్రైవర్. ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పొరపాటున తన ఖాతాకు పంపిన రూ.10,000 మొత్తాన్ని వెతికి మరీ తిరిగి అప్పగించి అందరి ప్రశంసలు పొందుతున్నాడు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన ఈ ఘటన తాలూకు వార్త ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.భువనేశ్వర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దేబశిష్ త్రిపాఠి, ఇటీవల తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఈ ఘటన గురించి పంచుకున్నారు. ఆయన కథనం ప్రకారం.. "నేను పని మీద ఒక క్యాబ్ బుక్ చేసుకున్నాను. నా వ్యాపార భాగస్వామికి రూ.10,000 పంపాల్సి ఉండగా, పొరపాటున ఉబెర్ డ్రైవర్‌కు పంపించాను. ఇద్దరి పేర్లూ ఒకటే కావడంతో ఈ పొరపాటు జరిగింది. యాప్ ద్వారా అతడిని సంప్రదించడానికి ప్రయత్నించినా వీలు కాలేదు. దీంతో ఇక, ఆ డబ్బులు తిరిగిరావని నేను భావించాను" అని దేబశిష్ తన పోస్టులో పేర్కొన్నారు.అయితే, అందరినీ ఆశ్చర్యపరుస్తూ అదే రోజు రాత్రి 9:30 గంటలకు దేబశిష్‌కు తన అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ నుంచి ఫోన్ వచ్చింది. ఆ ఉబెర్ డ్రైవర్ శ్రీకాంత, దేబశిష్ అడ్రస్ తెలుసుకుని, డబ్బు తిరిగి ఇచ్చేందుకు స్వయంగా అక్కడికి వచ్చాడు. ఈ విషయాన్ని వివరిస్తూ దేబశిష్.. "ఆ ఉబెర్ డ్రైవర్ నా కోసం వెనక్కి వచ్చి ప్రతి పైసా తిరిగి ఇచ్చేశారు. ఆయన నిజాయతీకి చిన్న బహుమతి ఇస్తానన్నా సున్నితంగా తిరస్కరించారు. ఈ రోజుల్లో ఇంతటి నిజాయతీ, చిత్తశుద్ధి చూడటం చాలా అరుదు. నా కోసం ఇంత శ్రమ తీసుకున్న శ్రీకాంతకు నేను ఎంతో రుణపడి ఉంటాను" అని రాసుకొచ్చారు.ఈ పోస్ట్ కొద్ది గంటల్లోనే 1.6 లక్షలకు పైగా వ్యూస్‌తో వైరల్‌గా మారింది. శ్రీకాంత నిజాయతీని మెచ్చుకుంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపించారు. "మంచి వాళ్లకు మంచే జరుగుతుంది", "ఆ నిజాయతీపరుడిని దేవుడు చల్లగా చూడాలి" అంటూ ప్రశంసించారు. ఇదే సమయంలో మరో యూజర్ తన చేదు అనుభవాన్ని పంచుకుంటూ, "నేను పొరపాటున పంపిన రూ.2000 ఓ ఆటో డ్రైవర్ కాజేశాడు. ఉబెర్ కస్టమర్ సపోర్ట్ కూడా స్పందించలేదు" అని వాపోయాడు.

# సోషల్ మీడియా రీల్ చూసి 'ఉమ్మెత్త' కూర వండుకుని తిన్నారు

**ఒకే కుటుంబంలోని నలుగురి పరిస్థితి విషమం!**

**అనకాపల్లి జిల్లా ఎర్రంపాలెం గ్రామంలో ఘటన**

**ఉమ్మెత్త కూర తిన్న వెంటనే తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురు**

**విషమంగా ఉన్న పరిస్థితి**



సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు ప్రాణాల మీదకు తెస్తాయని అనకాపల్లి జిల్లా ఎర్రంపాలెం గ్రామస్థుల పరిస్థితి నిరూపిస్తోంది. సోషల్ మీడియాలో వచ్చిన ఒక వీడియోను చూసి, ఉమ్మెత్త కూర ఆరోగ్యం అని నమ్మిన ఒకే కుటుంబానికి చెందిన గంగాభవాని, వీరలక్ష్మి, వీరబ్బు, జయలక్ష్మి అనే నలుగురు... నిన్న ఆ కూర వండుకుని తిన్నారు. తిన్న కాసేపటికే తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇది గమనించిన స్థానికులు వారిని వెంటనే కాకినాడ జీజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.వైద్యుల హెచ్చరిక ప్రకారం... ఉమ్మెత్త అనేది అత్యంత విషపూరితమైన మొక్క. ఇందులో ఉండే ఆల్కలాయిడ్స్ నేరుగా నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. దీనికి ప్రత్యేకమైన విరుగుడు ఉండదని, శరీరంలో విషం శాతం పెరిగితే ప్రాణాపాయం తప్పదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అమ్మవారి జాతర కోసం హైదరాబాద్ నుండి సొంత ఊరికి వచ్చిన ఈ కుటుంబం, ఇలాంటి చిన్న పొరపాటుతో ప్రాణాల మీదకు తెచ్చుకోవడం స్థానికులను కలచివేస్తోంది. ఏవైనా ఆరోగ్య చిట్కాలు పాటించే ముందు అవి వాస్తవమో కాదో సరిచూసుకోవాలని, ముఖ్యంగా తెలియని మొక్కలను ఆహారంగా తీసుకోకూడదని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

# తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలపై సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం

**పలు సూచనలు చేసిన రఘురాం రాజన్**

**మూడు, నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు రానున్నట్లు తెలిపిన రఘురాం**

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎంకు పలు సూచనలు**

**పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు ఏఐపై కమిటీ వేస్తామన్న సీఎం**



పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సిలబస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కమిటీ వేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కమిటీకి అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్‌ను సీఎం కోరారు. ఏఐని సరైన విధానంలో వినియోగిస్తే అందరికి మేలు జరుగుతుందని రఘురాం రాజన్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలపై జరిగిన సమావేశంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు సూచనలు చేశారు.యువత నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రఘురాం రాజన్ అన్నారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్య తగ్గించుకోవాలని సూచించారు. కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ప్రభుత్వాల సులభతర వ్యాపార విధానాలపై ఆధారపడి ఉంటాయని రఘురాం రాజన్ అన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందన్నారు.తమిళనాడు తరహా పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చునని రఘురాం రాజన్ తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు. డేటా సెంటర్లకు విద్యుత్, నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని ఆర్బీఐ మాజీ గవర్నర్ అభిప్రాయపడ్డారు. మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు రానున్నట్లు రాజన్ తెలిపారు. మిడిల్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు రఘురాం రాజన్‌కు సీఎం వివరించారు.రాష్ట్రంలో పరిశ్రమలకు అవసరమైన అన్ని సదపాయాలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో సులభతర వ్యాపారానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సమావేశంలో సీఎస్ రామక్రిష్ణారావు, ఉన్నతాధికారులు శేషాద్రి, అజిత్ రెడ్డి, జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.పాఠశాల, ఉన్నత, సాంకేతిక, వైద్య విద్య పాఠ్యాంశాలలో ఏఐని ఏకీకృతం చేయడంపై సిఫార్సులు అందించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయడంలో సహాయపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్‌ను కోరారు. మధ్యస్థాయి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీ, అధునాతన శిక్షణా కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు.ఏఐని సక్రమంగా వినియోగించడం వల్ల సమాజంలోని అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుందని రాజన్ పేర్కొన్నారు. పారిశ్రామిక వృద్ధికి అవసరమైన భూమి లభ్యత, పటిష్టమైన ప్రాథమిక సౌకర్యాలతో సహా అన్ని మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయని, భవిష్యత్ అవసరాలను తీర్చడానికి విద్యుత్ ఉత్పత్తిని విస్తరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతో పాటు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ వంటి కీలక మౌలిక సదుపాయాలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రిజీనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్ల కోసం ప్రణాళికలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.రాష్ట్రంలో పటిష్టమైన శాంతిభద్రతలు ఉన్నాయని, మొత్తం మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధిని సాధిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ మోడల్‌తో ముందుకు సాగుతోందని యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించామన్నారు. అధునాతన శిక్షణను అందించడానికి ఐటీఐలను ఏటీసీలుగా ఉన్నతీకరిస్తున్నట్లు తెలిపారు. వ్యాపార సౌలభ్యానికి తెలంగాణ అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తోందని, ఫార్మా, ఐటీ, డేటా సెంటర్ల వంటి రంగాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# ప్రభాస్ సినిమా షూటింగ్.. ఘోర ప్రమాదం.. ఒకరి మృతి

**ప్రభాస్ 'ఫౌజీ' సెట్స్ లో నెలకొన్న విషాదం**

**షూటింగ్ కు వెళ్తున్న యూనిట్ సభ్యుల కారుకు యాక్సిడెంట్**

**డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఒకరి మృతి**

**మరో ఐదుగురికి తీవ్ర గాయాలు**



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ' సెట్స్‌లో విషాదం నెలకొంది. ఈ ఉదయం షూటింగ్ నిమిత్తం వెళ్తున్న యూనిట్ సభ్యుల కారు హైదరాబాద్ శివార్లలోని అబ్దుల్లాపూర్ మెట్ వద్ద ప్రమాదానికి గురైంది. కారు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మరణించగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు.సినిమా షూటింగ్ పనుల్లో బిజీగా ఉన్న సమయంలో తమ సహచరుడు మరణించాడనే సమాచారంతో చిత్ర యూనిట్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. మరోవైపు, సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమా యూనిట్‌లో ఈ ఘటన విషాద ఛాయలను నింపింది. మృతుడి కుటుంబానికి చిత్ర బృందం తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

# రాష్ట్రంలో ఆ 51 కులాల పేర్ల మార్పు

**బీసీ కమిషన్ సిఫార్సులకు ఆమోద ముద్ర**

**కులస్థుల ఆత్మగౌరవాన్ని కాపాడేలా ప్రభుత్వం నిర్ణయం**

**కొన్ని కులాల పేర్లు సామాజికంగా చులకనగా, తిట్ల మాదిరిగా ఉండటం వల్ల అన్ని రంగాల్లో ప్రభావం**

**పేర్లు మార్చి కులాలకు కొత్త గుర్తింపు**



తెలంగాణ ప్రభుత్వం బీసీ కమిషన్ సిఫార్సుల వల్ల 51 కులాలను 'జాతులు, సంచార, అర్ధ సంచార కులాలు'గా గుర్తించేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. బీసీఏలో 49, బీసీఈలో 2 కులాలకు డీఎన్‌టీ జారీ చేసేందుకు అంగీకరించింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సీడ్ పథకానికి అవసరమైన అర్హులను ఎంపిక చేసుకోవడానికి డీఎన్‌డీగా నోటిఫై చేసి ధ్రువపత్రాలు జారీ చేయాలని డీఎన్‌టీ బోర్డు ఇప్పటికే సూచించింది. దీనిపై 51 కులాలను సంచార జాతులుగా గుర్తిస్తూ బీసీ కమిషన్ సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫార్సులు చేసింది. దీనిని ఆర్డీవోల ఆధ్వర్యంలో జారీ చేయాలని సూచించింది.బీసీ కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ విచారణలు, కుల సంఘాలతో సమావేశాలు నిర్వహించి విస్తృతంగా చర్చించింది. జనవరి 2025లో 8 కులాల పేర్ల మార్పు, పర్యాయపదాలు చేర్చడంపై నోటిఫికేషన్ జారీ చేసి అభ్యంతరాలు కోరింది. వచ్చిన సూచనలు, అభ్యంతరాల ఆధారంగా తుది సిఫార్సులు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించింది.కొన్ని కులాల పేర్లను మార్చాలంటూ కుల సంఘాలు చేస్తున్న విజ్ఞప్తిపై బీసీ కమిషన్ స్పందించింది. ఈ విషయంపై క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించింది. చివరకు చేసిన సిఫార్సులను మంత్రి మండలి ఆమోదించింది. రాష్ట్రంలో కొన్ని కులాల పేర్లు పిలవడానికి చాలా ఇబ్బందికరంగా ఉన్నాయి. ఆయా కులాలను పిలిచినప్పుడు వారిని తిట్టినట్టుగా ఉంది. దీంతో ఆ కులస్థుల ఆత్మగౌరవాన్ని కాపాడేలా ప్రభుత్వం వాటి పేర్లను మార్చాలని నిర్ణయం తీసుకుంది. దీనివల్ల కొన్ని కులాల పేర్లను తొలగించి, నూతన పేర్లను పెట్టారు.ఏళ్లుగా కొన్ని కులాల పేర్లు సామాజికంగా చులకనగా, తిట్లుగా మారాయి. ఇది విద్య, ఉపాధి, వివాహాలు, సామాజిక గౌరవం వంటి అన్ని రంగాల్లో ప్రభావం చూపుతోందని సంఘాలు ఫిర్యాదు చేశాయి. పేర్లు మార్చడం ద్వారా ఆయా సమాజాలకు కొత్త గుర్తింపు, గౌరవం లభించి తర్వాతి తరాలపై ప్రతికూల ప్రభావం తగ్గుతుందని కమిషన్ అభిప్రాయపడింది. దీంతో కులాల పేర్లను మార్చడానికి సిద్ధమైంది.కులం పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆ పేరును తొలగించారు. దొమ్మర కులం పేరును తొలగించి గడవంశీయగా (గ్రూప్-ఏగా నంబరు 7) మార్చింది. పిచ్చకుంట్ల పదాన్ని తీసివేసి వంశరాజ్‌గా (బీసీఏ, నంబరు 18) పేర్కొంది. బీసీడీలోని నంబరు 29 కింద శుద్రకులం పేరును తొలగించారు. ఆ కులం స్థానంలో తమ్మాలి మార్చారు. బుడుబుక్కల కులానికి బీసీఏలో నంబర్ 4గా ఉంది. దీనికి శివక్షత్రియ పేరును పర్యాయపదంగా చేర్చారు. బీసీఏలో నంబర్ 5లో ఉన్న వన్నార్ పేరును తొలగించారు. ఆ పేరుకు బదులు ధోబీ పేరును పర్యాయపదంగా చేర్చారు.దీంట్లో చాకలి, ధోబీ, రజక పేర్లు కూడా ఉంటాయి. మేర, చిప్పొళ్లు కులాలకు పర్యాయపదంగా బీసీడీలో నంబర్ 5 కింద 'మేరు'ను చేర్చింది. బీసీఏలో నంబరు 23 ద్వారా వీరభద్రీయ పేరును పర్యాయపదంగా పేర్కొంది. దీని కింద వీరముష్ఠి, వీరభద్రీయ, నెట్టికోటల ఉంటాయి. ఈ పేర్లతో ధ్రువపత్రాలు కూడా జారీ అవుతాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనకరంగా మారనుంది. దీనివల్ల సమాజంలో ఆ కులాల ప్రజల గౌరవ, మర్యాదలకు ఇక నుంచి ఎలాంటి అభద్రతా, తిట్లు, ఇబ్బందులు ఉండవు. అన్ని కులాలతో సమానంగా వారికి కూడా అన్ని రకాల సదుపాయాలు లభించనున్నాయి.

# బెంగాల్ లో ఎంఐఎంకు షాక్.. అన్ని స్థానాల్లో డిపాజిట్ల గల్లంతు

**పోటీ చేసిన 12 స్థానాల్లోనూ ఎంఐఎంకు ఘోర పరాభవం**

**ఎంఐఎం కొంప ముంచిన హుమయూన్ కబీర్**

**ఒక స్టింగ్ ఆపరేషన్ లో అడ్డంగా దొరికిపోయిన హుమయూన్**




పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల బరిలో ఎంఐఎం పార్టీకి బెంగాల్ ఓటర్లు కోలుకోలేని షాక్ ఇచ్చారు. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఈ పార్టీ పోటీ చేసిన 12 స్థానాల్లోనూ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. అమ్ జనతా ఉన్నాయున్ పార్టీ నేత హుమయూన్ కబీర్‌తో పొత్తు పెట్టుకుని, బీహార్ ఫార్ములాతో ముస్లిం ఓట్లను చీల్చాలని ఎంఐఎం ప్రయత్నించినప్పటికీ, అది బెంగాల్‌లో ఏమాత్రం పారలేదు. ముఖ్యంగా ఒక స్టింగ్ ఆపరేషన్‌లో హుమయూన్ కబీర్ దొరికిపోవడం ఎంఐఎం కొంపముంచింది. బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకే తాము ముస్లిం ఓట్లను చీలుస్తున్నామని ఆయన ఆ ఆపరేషన్‌లో వ్యాఖ్యానించడం మైనారిటీ ఓటర్లలో తీవ్ర వ్యతిరేకతకు దారితీసింది. ఈ వివాదం తర్వాత ఎంఐఎం ఆ పార్టీతో తెగదెంపులు చేసుకున్నప్పటికీ, ఓటర్లు మాత్రం ఎంఐఎంను హుమాయున్ కబీర్ భాగస్వామిగానే పరిగణించి తిరస్కరించినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా, బెంగాల్ రాజకీయాల్లో తన ఉనికిని చాటుకోవాలనుకున్న ఎంఐఎం ఆశలు పూర్తిగా అడియాశలయ్యాయి.

# అధిక వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు కాస్త ఊరట

**క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఒక డిగ్రీ మేర తగ్గిన ఉష్ణోగ్రతలు**

**రెండు మూడు రోజుల్లో మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం**

**పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు**



తెలంగాణలో అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. సాయంత్రం దాకా ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం ఏడు గంటలకే ఎండ తీక్షణంగా కాస్తోంది.కాగా, క్యాములోనింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక డిగ్రీ మేర తగ్గాయి. రానున్న రెండు మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ఈ నెల 8వ తేదీ నుంచి మళ్లీ క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగనున్నట్లు తెలిపారు. ఈరోజు, రేపు, ఎల్లుండి క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## ఇలాంటి ఆహారాలు మీ కిడ్నీలను దెబ్బతీస్తాయి.. వెంటనే వాటికి గుడ్ బై చెప్పండి



కిడ్నీ మన శరీరానికి అవసరమైన అవయవాలలో ఒకటి. ఇది శరీరంలో అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది. ఆరోగ్యకరమైన మూత్రపిండాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. శరీరంలోని ఈ ముఖ్యమైన భాగాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. అయినప్పటికీ, వేగంగా మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల పట్ల అజాగ్రత్తగా ఉండటం వల్ల కిడ్నీ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. అటువంటి పరిస్థితిలో మీరు మీ మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే ఈ 5 ఆహారాలకు దూరంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాంటి అనారోగ్యకర ఆహారాల గురించి తెలుసుకుందాం. మీరు కిడ్నీ సంబంధిత వ్యాధికి గురైనట్లయితే పాల ఉత్పత్తులకు అంటే చీజ్, క్రీమ్, వెన్న వంటి పూర్తి కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. దీంతో కిడ్నీ, గుండె సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. అలాగే, మీరు టమోటాలను ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే, అది మూత్రపిండాలకు హానికరం. మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండటానికి, టమాటాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. ప్యాక్డ్ ఫుడ్స్ అన్ని విధాలుగా ఆరోగ్యానికి హానికరం. ఇలాంటి ఆహారాన్ని తాజాగా ఉంచడానికి, అధిక సోడియం ఉపయోగిస్తారు. ఇది రక్తపోటును పెంచుతుంది. మూత్రపిండాలను కూడా ప్రభావితం చేస్తుంది. అలాగే, నారింజ కూడా. ఇందులో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది మూత్రపిండాలకు హానికరం. మీరు మీ ఆహారంలో నారింజను కూడా చేర్చుకుంటే, ఈరోజే దానికి వీడ్కోలు చెప్పండి. మూత్రపిండాల వ్యాధి ఉన్నవారికి రెడ్ మీట్ చాలా హానికరం. దీన్ని తీసుకోవడం వల్ల కిడ్నీకి ఎక్కువ నష్టం వాటిల్లుతుంది.

## బెండకాయలను తింటే ఇన్ని లాభాలు కలుగుతాయా.. తెలిస్తే షాకవుతారు



బెండకాయలు.. వీటినే ఇంగ్లిష్‌లో ఓక్రా అని, లేడీస్ ఫింగర్ అని కూడా పిలుస్తారు. బెండకాయలను మొదటగా ఆఫ్రికాలో పండించారు. అక్కడి నుంచి ఇవి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకు వ్యాపించాయి. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది బెండకాయలను ఎంతో ఇష్టంగా తింటుంటారు. వీటితో అనేక రకాల వంటకాలను చేస్తుంటారు. బెండకాయలను లేతగా ఉన్నప్పుడే తినాల్సి ఉంటుంది. ముదిరితే రుచి అంత బాగోవు. ఇక బెండకాయలతో మనం వేపుడు, పులుసు వంటివి చేస్తుంటాం. చాలా మంది వీటిని చారు వంటి వాటిలోనూ వేస్తుంటారు. దీంతో ఇవి చక్కని రుచిని కలిగి ఉంటాయి. అయితే బెండకాయలను తరచూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వీటిల్లో విటమిన్లు ఎ, సి సమృద్ధిగా ఉంటాయి. అలాగే పొటాషియం, మెగ్నిషియం కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి.

### హార్ట్ ఎటాక్ రాదు..

బెండకాయల్లో విటమిన్లు ఎ, సిలతోపాటు మెగ్నిషియం, పొటాషియం, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనల్ని అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ కాయలను తరచూ తినడం వల్ల వీటిల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమయ్యేలా చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. బెండకాయలను తరచూ తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. జీర్ణవ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణాశయం, పేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. బెండకాయలను తినడం వల్ల మన శరీరం ఆహారాల్లో ఉండే కొవ్వును శోషించుకోదు. దీంతో శరీరంలో కొలెస్ట్రాల్ చేరకుండా అడ్డుకోవచ్చు. ఫలితంగా రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

### అధిక బరువు తగ్గుతారు..

బెండకాయల్లో పాలిఫినాల్స్ అనే సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయి. అలాగే వీటిల్లో ఫైబర్ కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తాయి. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది. మధుమేహం ఉన్నవారికి బెండకాయలు ఒక వరం అనే చెప్పవచ్చు. వీటితో డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. బెండకాయలను తినడం వల్ల విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో రోగాలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. అధిక బరువు ఉన్నవారు బెండకాయలను తరచూ తింటుంటే బరువును తగ్గించుకోవచ్చు. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయకుండా చేయడంలో బెండకాయలు ఎంతో ఉపయోగపడతాయి. దీంతో అధిక బరువును తగ్గించుకోవచ్చు.

### కంటి చూపు మెరుగు పడుతుంది..

బెండకాయల్లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. తరచూ బెండకాయలను తినడం వల్ల కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. వయస్సు మీద పడడం వల్ల వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. వీటిని తింటుంటే శరీరంలోని నొప్పులు, వాపులను తగ్గించుకోవచ్చు. బెండకాయల్లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు శరీరంలోని నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. ఈ కాయల్లో క్యాల్షియం, విటమిన్ సి, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇలా బెండకాయలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## పింక్ సాల్ట్ వాడుతున్నారా?.. అయితే ఈ విషయం తెలుసుకోండి!



రోజువారీ ఆహారంలో ఉప్పు చాలా ముఖ్యం. ఇది రుచిని పెంచడమే కాదు, శరీర పనితీరుకు కూడా అవసరం. ప్రస్తుతం మార్కెట్లో వైట్ సాల్ట్‌తో పాటు పింక్ సాల్ట్ కూడా బాగా ప్రాచుర్యం పొందింది. అయితే, వైట్ సాల్ట్‌ను పూర్తిగా పక్కనపెట్టి పింక్ సాల్ట్ వాడటం ఆరోగ్యానికి మంచిది కాదని పోషకాహార నిపుణురాలు దాజ్‌మీత్ హెచ్చరిస్తున్నారు. పింక్ సాల్ట్ వాడకం పెరిగాక థైరాయిడ్ సమస్యలు ఎక్కువయ్యాయని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో తెలిపారు.వైట్ సాల్ట్‌లో ఉండే అయోడిన్, థైరాయిడ్ గ్రంథి పనితీరుకు చాలా కీలకమని దాజ్‌మీత్ వివరించారు. అయోడిన్ లోపం వల్ల గాయిటర్ వంటి సమస్యలు వస్తాయని గుర్తుచేశారు. అంతేకాకుండా, వైట్ సాల్ట్‌లోని సోడియం శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటంలో, నరాల పనితీరులో, కండరాల సంకోచ వ్యాకోచాలలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.పింక్ సాల్ట్‌లో 84 రకాల ఖనిజాలు ఉంటాయని ప్రచారం ఉన్నప్పటికీ, అవి చాలా స్వల్ప మోతాదులో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ఖనిజాల వల్ల చెప్పుకోదగ్గ ఆరోగ్య ప్రయోజనాలు ఉండవు. ఉదాహరణకు, ఒక వ్యక్తికి రోజువారీ పొటాషియం అవసరం తీరాలంటే సుమారు 1.7 కిలోల పింక్ సాల్ట్ తినాల్సి ఉంటుంది.సాధారణ ఉప్పులో ఉండే అడిటివ్స్ (ఖ౦ఒట౯జవం) వద్దనుకునే వారికి పింక్ సాల్ట్ ఒక సహజ ప్రత్యామ్నాయం మాత్రమేనని, అంతకుమించి గొప్ప ఆరోగ్య ప్రయోజనాలు ఆశించవద్దని స్పష్టం చేస్తున్నారు. పూర్తిగా పింక్ సాల్ట్‌కు మారితే, అయోడిన్ కోసం సముద్రపు పాచి, పాలు, చేపలు వంటి ఇతర ఆహార పదార్థాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అందుకే, వంటల కోసం వైట్ సాల్ట్, సలాడ్ల వంటి వాటిపై చల్లుకోవడానికి పింక్ సాల్ట్ వాడటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## గుండె ఆరోగ్యం "స్పెషల్ డైటు





పని చేసినంత వరకూ గుండె గురించి పెద్దగా పట్టించుకోం. ఎప్పుడైనా సమస్య వచ్చినప్పుడు 'ముందే జాగ్రత్త పడితే బాగుండేది కదా' అని చింతిస్తాం. అందుకే, పరిస్థితి అంత వరకూ రాకుండా ముందే మేల్కోవాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో గుండెకు మేలు చేసే డైట్‌ల గురించి తెలుసుకొని, పాటిస్తే మేలని చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! సాధారణంగా బరువు తగ్గాలనుకునే వారు లేదా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు డైట్ పాటిస్తారు. కానీ, గుండె ఆరోగ్యం కోసం కొన్ని రకాల డైట్ చేయవచ్చంటున్నారు నిపుణులు. అలాగే, గుండె ఆరోగ్యం కోసం పండ్ల రసాలు, ఆకుకూరలు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, గింజలు, విత్తనాలు, కొవ్వు కలిగిన చేపలతో కూడిన ఆహారంపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యం. ఈ క్రమంలో సోడియం, చక్కెర, సంతృప్త కొవ్వులు, ప్రాసెస్ చేసిన ఆహారాలను పరిమితం చేసుకోవాలంటున్నారు నిపుణులు. మెడిటరేనియన్ డైట్ అనేది మధ్యధరా సముద్ర తీర దేశాలైన గ్రీస్, ఇటలీ, స్పెయిన్ ప్రజల సంప్రదాయ ఆహారపు అలవాట్లపై ఆధారపడిన ఒక ఆరోగ్యకరమైన జీవనశైలి. ఇది ప్రపంచంలోనే అత్యంత ఆరోగ్యకరమైన ఆహార విధానాలలో ఒకటిగా గుర్తించబడింది. ఈ డైట్ గుండెకు చాలా మేలు చేస్తుంది. ఇందులో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, చేపలను ఎక్కువగా తీసుకుంటారు. అంతేకాదు, ఆలివ్ ఆయిల్ వాడతారు. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందంటున్నారు నిపుణులు. మెడిటరేనియన్ డైట్ పాటించే వ్యక్తులకు రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తక్కువగా ఉన్నాయని బఎఖజఅం.వఎబ అధ్యయనం పేర్కొంది.ఈ డైట్‌లో 'ఏం తినాలి' అనే దానికంటే, 'ఎప్పుడు తినాలి' అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఇందులో రోజంతా నిర్ణీత గంటల పాటు ఉపవాసం ఉండి, మిగిలిన సమయంలో మాత్రమే ఆహారం తీసుకోవడం జరుగుతుంది. ఇది ఊబకాయం, రక్తపోటు, టైప్ 2 డయాబెటిస్‌ను అదుపులో ఉంచుతుందని చెబుతున్నారు. అయితే, దీనిని అనుసరించే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు.ఆరోగ్యకరమైన, సమతులాహారం అంటే మన శరీరానికి కావలసిన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు సరైన నిష్పత్తిలో ఉంటాయి. ఇందులో తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు అనేవి రక్త ప్రసరణను మెరుగుపరచడంతో పాటు బరువును నియంత్రణలో ఉంచుతాయి. డైట్ అనేది ముఖ్యంగా రక్తపోటును తగ్గించడానికి రూపొందించిన ఒక శాస్త్రీయ ఆహార విధానం. ఇది 2026లో కూడా ప్రపంచవ్యాప్తంగా గుండె ఆరోగ్యానికి అత్యుత్తమ డైట్‌లలో ఒకటిగా పరిగణిస్తున్నారు. ఈ డైట్ పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలతో నిండి ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడానికి, గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి రూపొందించబడింది. ణూూం ఆహారం హృదయ, జీవక్రియ ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడానికి స్థూల పోషకాలు, సూక్ష్మపోషకాల సమతులాహారం అందిస్తుందని చీఅశీఖ్రీ ాఆఎతీఖతీఎ శీట వీఎఞఆఏఅఅవ అధ్యయనం పేర్కొంది. తృణధాన్యాలు, తక్కువ గ్లైసెమిక్ పండ్లు, ఆకుకూరలు, చిక్కుళ్లు నుంచి సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు, ఫైబర్, అవసరమైన సూక్ష్మపోషకాలను సరఫరా చేస్తాయని తెలిపింది.దీనినే 'శిలాజ యుగం నాటి ఆహారం' (ఖుజవఖఅ ఞఅవ్) అని కూడా అంటారు. మన పూర్వీకులు వ్యవసాయం ప్రారంభించకముందు, అంటే సుమారు 10,000 ఏళ్ల క్రితం వేటాడటం లేదా అడవుల దొరికే పండ్లను మాత్రమే తినేవారు. ఈ పద్ధతినే పాలియో డైట్ అని పిలుస్తారు. ఆధునిక పాలియో డైట్‌లో పండ్లు, కూరగాయలు, లీన్ మాంసాలు, చేపలు, గుడ్లు, గింజలు, విత్తనాలు ఉంటాయని ఖఎ-శీఎశ్రీఅఅఅఎ అధ్యయనం పేర్కొంది.ఈ డైట్‌లో మొక్కల నుంచి లభించే ఆహార పదార్థాలపై ఆధారపడే జీవనశైలి. ఇది కేవలం శాకాహారం మాత్రమే కాదు, ఇందులో జంతు సంబంధిత ఆహారాన్ని కూడా తీసుకోవచ్చు. కానీ, ఈ డైట్‌లో 70-80% మొక్కల నుంచి లభించే ఆహారం మాత్రమే తీసుకోవాలి. తద్వారా రక్తపోటు, కొలెస్ట్రాల్ అదుపులో ఉండి గుండె జబ్బుల ముప్పు తగ్గుతుందంటున్నారు నిపుణులు.ఇది శరీరంలో దీర్ఘకాలిక వాపు లేదా మంటను తగ్గించే ఆహార నియమావళి. ఈ డైట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారాలు గుండె వాపును తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.ఈ డైట్‌లు రెండూ పిండి పదార్థాలను తగ్గించి, శరీరానికి అవసరమైన శక్తిని కొవ్వుల నుంచి పొందేలా చేస్తాయి. 2026 నాటికి బరువు తగ్గడానికి ఇవి ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన పద్ధతులు. అంతేకాదు, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి సహాయపడతాయి. రక్తపోటు కూడా అదుపులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.ఉప్పును తగ్గించి, పొటాషియం ఎక్కువగా ఉండే చిలగడదుంపలు, టమోటాలు వంటివి తీసుకోవడం వల్ల గుండె, ధమనులపై ఒత్తిడి తగ్గుతుందట.ఇది పూర్తిగా శాకాహారం తీసుకుంటూనే, అప్పుడప్పుడు లేదా మితంగా మాంసాహారాన్ని అనుమతించే ఒక సౌకర్యవంతమైన ఆహార విధానం. దీనిని 2026లో అత్యంత సులభంగా పాటించదగ్గ, సమతులమైన డైట్‌లలో ఒకటిగా నిపుణులు పేర్కొంటున్నారు. ఇది బరువు తగ్గడానికి, గుండె జబ్బులు, క్యాన్సర్, టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుందంటున్నారు.

## రాజ్యాంగంలో సైన్స్ స్ఫూర్తి




ఎవరో చెప్పారని, లేదా సంప్రదాయమని, లేదా నీకు నీవే ఊహించుకొని దేనినీ నమ్మొద్దు! చెప్పిన గురువు మీద గౌరవంతో విన్నదంతా నమ్మొద్దు! నీకు నువ్వే పరీక్షించి, విశ్లేషించుకుని అది మంచిదని, సమాజానికి మేలు చేస్తుందని బోధపడిన తర్వాతే దాన్ని స్వీకరించు, దాన్ని నీ పథంగా అందుకో !' అని రెండున్నర వేల సంవత్సరాల క్రితం బుద్ధుడు చెప్పాడు. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎలా పరిగణించి ముందుకెళ్లాలో తెలియజెప్పడానికి ఈ మార్గాన్ని ఆయన సూచించాడు. దీనినే ప్రపంచవ్యాప్తంగా 'సైంటిఫిక్ టెంపర్' అనే భావనకు సమగ్రమైన నిర్వచనంగా పరిగణిస్తున్నారు. 'సైంటిఫిక్ టెంపర్' అనే మాటను తొలుత వాడింది సిద్ధాంతకర్త కాదు, భాషావేత్త అసలే కాదు. జవహర్‌లాల్ నెహ్రూ 1946లో తన పుస్తకం 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో ఈ మాటను మొదటిసారి ఉపయోగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ భావన మరింత గౌరవనీయమైన స్థానాన్ని ఆక్రమించింది. 1958లో సైన్స్ పాలసీ వచ్చినప్పటి నుంచి ఈ మాటను విరివిగా వాడటంతోపాటు సైన్స్- సమాజం మధ్యనున్న సంబంధ బాంధవ్యాలను బలోపేతం చేయడానికి కృషి పెరిగింది. 'సైన్స్ టెంపర్' అనే మాటను తెలుగులో 'సైన్స్ అభినివేశం' లేదా 'శాస్త్రీయ అభినివేశం' అని అనువాదం చేసుకోవచ్చు. ప్రశ్నించడం, పరిశీలించడం, పరీక్షించడం, ప్రతిపాదించడం, విశ్లేషించడం, సమాజానికి అనువర్తింప చేయడం, ఫలితాలను జాగ్రత్తగా పరిశీలించడం వంటివి ఈ కోవలోకి వస్తాయి. ప్రపంచంలో భారతదేశమే తొలిసారి తన రాజ్యాంగంలో ఈ 'సైంటిఫిక్ టెంపర్' గురించి పేర్కొన్నది. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నియమాలని విధిగా గౌరవిస్తూ జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలని మొదలయ్యే ప్రాథమిక విధులు పౌరులకు ఉంటాయని ఆర్టికల్ 51 (ఏ) హెచ్ చెప్తుంది. ఇందులో ఎనిమిదవది అయిన హెచ్.. '%ుశీ నవజవశ్రీశీజూ ష్ట్రవ ం౦ఎఅవత్‌ఱటఱఎ్ వఎ- జూవతీ, ష్ట్రబఖఅఱంఎ ఖఅఎ ంజూఱతీఱ్ శీట ఱఅనబఱతీఎ ఖఅఎ తీవటశీతీఎ%' అని వివరిస్తున్నది. ఈ మాటలను జాగ్రత్తగా గమనిస్తే సైంటిఫిక్ టెంపర్‌తో పాటు మానవత, జిజ్ఞాస, సంస్కరణ అనే భావనలు కూడా కనబడతాయి. ఈ నాలుగింటిని కలగలిపి మన దృష్టి పథాన్ని రూపొందించుకోవాల్సింది ఉంటుంది. 1976లో 42వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు ఈ 'హెచ్' అధికరణం వచ్చి అంతర్భాగమైంది. మరి భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాలకు ఎంత ఖర్చు పెడుతున్నదనే సందేహం రాకమానదు. జీడీపీలో 0.66 శాతమే భారతదేశం ఇం దుకు కేటాయించింది. నిజానికి ఒక శాతం చేస్తున్నట్టు రెండు దశాబ్దాలు గా మనం వింటున్నాం, కానీ వాస్తవరూపం ధరించలేదు. తమ తలసరి ఆదాయంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు 3.07, చైనా 2.4, దక్షిణ కొరి యా 4.5 శాతం చొప్పున ఖర్చు పెడుతున్నాయి. కనుకనే, ఆ మేరకు ఫలితాలు వస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మంచి పరిశోధనలు చేయ డం వల్లే పారిశ్రామికంగా ఆ దేశాలు లాభదాయకమైన స్థానంలో ఉండగలుగుతున్నాయి. ఉత్తమమైన మానవ వనరులున్న మన దేశం కనీసం ఒక శాతం ఖర్చు పెట్టగలిగితే అద్భుతమైన ఫలితాలు వస్తాయి.

## రోజూ ఈ గింజలు తింటే కొవ్వు ఐస్‌లా కరిగిపోతుంది తెలుసా..?



ఈ మధ్య కాలంలో చాలామంది హై కొలెస్ట్రాల్ సమస్యను ఎదుర్కొంటున్నారు. రక్తంలో కొవ్వు సమస్యతో బాధపడుతున్నారు. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లే ఇందుకు కారణమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక కొలెస్ట్రాల్ కారణంగా గుండె జబ్బుల బారినపడే ప్రమాదం ఉంది. కొలెస్టరాల్ తగ్గడానికి కొన్ని రకాల గింజలు మేలు చేస్తాయి. వాటిలో ఫైబర్‌తోపాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. ఆ గింజలను ఆహారంగా తీసుకోవడంవల్ల కొవ్వు సమస్య నుంచి ఈజీగా బయటపడొచ్చు. మరి ఆ గింజలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.. అవిసె గింజలు గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటినే లీన్ సీడ్స్ అని కూడా అంటారు. ఈ గింజల్లో ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి తోడ్పడుతాయి. కొలెస్ట్రాల్ సమస్యను తగ్గించడంలో చియా విత్తనాలు కూడా దోహదపడతాయి. వీటిలో కూడా ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి దోహదపడతాయి. అదేవిధంగా జనపనార విత్తనాలను తీసుకోవడంవల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ప్రోటీన్‌తోపాటు గామా లినోలెనిక్ యాసిడ్ ఉంటుంది. కొలెస్టరాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇవి చక్కగా పనిచేస్తాయి. గుమ్మడి గింజలు కూడా కొవ్వును తగ్గించడంలో బాగా పనిచేస్తాయి. ఈ గింజలల్లో ఒమెగా-6 ఫ్యాటీ యాసిడ్స్, మోనో శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. నువ్వులకు కూడా కొవ్వును తగ్గించే గుణం ఉంది. వీటిలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. కడుపులో మంటను తగ్గించడంలో, కొవ్వును కరిగించడంలో ఇవి సాయపడతాయి. రక్తంలో కొవ్వు సమస్యతో బాధపడేవారు పొద్దుతిరుగుడు గింజలను తీసుకోవడంవల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిలో విటమిన్ 'ఇ' తోపాటు మోనో శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి సాయపడుతాయి. నల్ల నువ్వులను తీసుకోవడం వల్ల కూడా చెడు కొవ్వు తగ్గుతుంది. వీటితో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు క్యాన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది.

## జామ ఆకులు మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు ఈ విషయాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు



జామ పండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. జామకాయలను కూడా చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఇవి మనకు ఏడాది పొడవునా దాదాపుగా అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. జామ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. జామ పండ్లలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రోగాలు రాకుండా చూస్తుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది. ఈ పండ్లలో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకం ఉండవు. ఇలా జామ పండ్లతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. అయితే కేవలం పండ్లే కాదు.. ఆకులు కూడా మనకు కలిగే అనేక వ్యాధులను తగ్గించడంలో ఎంతగానో పనిచేస్తాయి.

### నోటి సమస్యలకు..

జామ ఆకుల్లో అనేక ఔషధ గుణాలు దాగి ఉన్నాయి. ఇవి మనకు కలిగే వ్యాధులను నయం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. జామ ఆకుల్లో అధిక మొత్తంలో ట్యానిన్స్, ఆక్సలేట్స్ ఉంటాయి. అందువల్ల నోటిపూత, నోటిలో పుండ్లు, చిగుళ్ల వాపు, గొంతు నొప్పి వంటి నోటి సమస్యలతో బాధపడేవారు లేత జామ ఆకులను నమిలితే ప్రయోజనం ఉంటుంది. లేదా జామ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను నోట్లో పోసుకుని పుక్కిలించాలి. దీంతో సమస్యలు తగ్గుతాయి. అలాగే జామ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతుంటే శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది.

### వెన్ను నొప్పికి..

ప్రస్తుత తరుణంలో చాలా మంది వెన్ను నొప్పి సమస్యతో బాధపడుతున్నారు. నిత్యం కంప్యూటర్ల ఎదుట కూర్చుని పనిచేసే ఉద్యోగాలు చేస్తున్నారు. దీంతో వెన్ను నొప్పి వస్తోంది. అయితే ఈ సమస్య ఉన్నవారు జామ ఆకుల నీళ్లను రోజూ తాగుతుండాలి. ఈ ఆకుల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే జామ ఆకుల నీళ్లను రోజూ సేవిస్తుంటే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. జామ ఆకుల్లో క్యాన్సర్ కణాలను నాశనం చేసే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలు రక్షించబడతాయి. క్యాన్సర్లు రాకుండా ఉంటాయి.

### నిద్రలేమి సమస్యకు..

రాత్రి పూట జామ ఆకులతో తయారు చేసిన నీళ్లను భోజనం చేసిన అనంతరం తాగితే మైండ్ రిలాక్స్ అవుతుంది. ఒత్తిడి, ఆందోళన నుంచి బయట పడవచ్చు. దీంతో మనస్సు ప్రశాంతంగా మారి చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. జామ ఆకుల నీళ్లను రోజూ తాగితే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. పొట్టలో గ్యాస్ ఉత్పత్తి కాదు. మలబద్దకం నుంచి ఉపశమనం పొందవచ్చు. జామ ఆకుల నీళ్లను తాగితే శరీరంలోని అన్ని అవయవాలకు రక్త సరఫరా మెరుగు పడుతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా చూసుకోవచ్చు. ఇలా జామ ఆకులతో అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# కబ్బన్ పార్క్ మెట్రోలో అంధకారం

### ఆఫీసులకు వెళ్లే ప్రయాణికులకు చుక్కలే!



బెంగళూరు మెట్రో ప్రయాణికులకు చుక్కలు కనిపించాయి. భారీ పవర్ కట్ కారణంగా కబ్బన్ పార్క్ మెట్రో స్టేషన్ ఏకంగా నాలుగు గంటల పాటు మూతపడింది. పీక్ అవర్స్‌లో పర్పుల్ లైన్‌లో తలెత్తిన ఈ సాంకేతిక సమస్యతో వేలాది మంది ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాల్సి వచ్చింది. స్టేషన్‌కు చేరుకున్న ప్రయాణికులను సెక్యూరిటీ సిబ్బంది లోపలికి అనుమతించకపోవడంతో అంతా అయోమయంలో పడిపోయారు. మెయిన్ పవర్ సిస్టమ్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో స్టేషన్ మొత్తం అంధకారంలో మునిగిపోయింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని దీవీ=జూ అధికారులు స్టేషన్‌ను తాత్కాలికంగా మూసివేయాలని నిర్ణయించారు. దీనివల్ల నగరవ్యాప్తంగా మెట్రో సర్వీసుల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. గత్యంతరం లేక ప్రయాణికులు నడుచుకుంటూ వెళ్లి విధాన సౌధ వంటి దగ్గర్లోని స్టేషన్లలో రైలు ఎక్కాల్సి వచ్చింది. కబ్బన్ పార్క్ స్టేషన్‌లో పవర్ కట్.. మెట్రో ప్రయాణికులకు తప్పని తిప్పలు రాత్రి వేళ పవర్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్‌లో లోపం తలెత్తడంతో ఈ సమస్య మొదలైంది. తెల్లవారుజాము వరకు ఇంజనీర్లు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. అండర్ గ్రౌండ్ స్టేషన్ కావడంతో పవర్ లేకపోతే సీసీ కెమెరాలు, ఎస్కలేటర్లు పనిచేయవు. అందుకే భద్రతా కారణాల దృష్ట్యా స్టేషన్‌ను క్లోజ్ చేశారు. ఆఫీసులకు వెళ్లే టైమ్ కావడంతో స్టేషన్ బయట జనం భారీగా గుమిగూడారు. మెట్రో సిబ్బంది ప్రయాణికులను ఎంజీ రోడ్ స్టేషన్‌కు వెళ్లాలని సూచించారు. దీంతో పక్కనే ఉన్న స్టేషన్లలో విపరీతమైన రద్దీ పెరిగిపోయింది. ముందస్తు సమాచారం ఇవ్వకుండా స్టేషన్ మూసివేయడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. కబ్బన్ పార్క్ మెట్రో బంద్.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఇలా.. బెంగళూరులో ఆఫీసులకు వెళ్లేవారికి పర్పుల్ లైన్ చాలా కీలకం. ఇలాంటి అంతరాయాలు వేలాది మంది ఉద్యోగుల సమయాన్ని వృథా చేస్తాయి. కబ్బన్ పార్క్ స్టేషన్‌లో రైళ్లు ఆపవద్దని పైలట్లకు ఆదేశాలు అందడంతో, ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఇతర మార్గాలను వెతుక్కోవాల్సి వచ్చింది.మెట్రో స్టేషన్ మూతపడటంతో ప్రైవేట్ ట్యాక్సీలకు డిమాండ్ పెరిగిపోయింది. సమయానికి ఆఫీసులకు వెళ్లడం కోసం ప్రయాణికులు భారీగా అదనపు ఛార్జీలు చెల్లించాల్సి వచ్చింది. మెట్రోనే నమ్ముకున్న వారికి లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెద్ద సమస్యగా మారింది. బస్సు స్టాపులు కూడా ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ప్రాంతం నడక సమయం స్టేషన్ పరిస్థితి ఎంజీ రోడ్ 10 నిమిషాలు యథావిధిగా నడుస్తోంది విధాన సౌధ 15 నిమిషాలు అందుబాటులో ఉంది కబ్బన్ పార్క్ - తాత్కాలికంగా మూసివేత ఎలక్ట్రికల్ సిస్టమ్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత స్టేషన్‌ను తిరిగి ప్రారంభించారు. పవర్ కట్ అయిన నాలుగు గంటల తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు ధృవీకరించింది. ఎస్కలేటర్లు, గేట్లను చెక్ చేసిన తర్వాతే ప్రయాణికులను లోపలికి అనుమతించారు. ప్రస్తుతం పర్పుల్ లైన్‌లో రైళ్లు యథావిధిగా నడుస్తున్నాయి. ఈ సాంకేతిక లోపంపై పూర్తిస్థాయి విచారణ జరుపుతామని దీవీ=జూ హామీ ఇచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపింది. మెయింటెనెన్స్ షెడ్యూల్‌ను కూడా సమీక్షిస్తున్నారు. ప్రయాణికుల భద్రతే తమకు మొదటి ప్రాధాన్యత అని అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ప్రయాణికులు మెట్రో అధికారిక యాప్స్ ద్వారా అప్‌డేట్స్ తెలుసుకోవడం మంచిది. దీనివల్ల ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవడం సులభమవుతుంది. నగర ప్రయాణాల్లో ఇలాంటి అడ్డంకులు ఎదురైనప్పుడు కాస్త అప్రమత్తంగా ఉంటే ఇబ్బందులు తగ్గుతాయి. బెంగళూరు అభివృద్ధిలో మెట్రో సేవలు అత్యంత కీలకం.

# హార్ముజ్ జలసంధిపై ట్రంప్ కీలక ప్రకటన

### చమురును అమెరికా నుండే కొనుగోలు చేయాలని ఆదేశాలు



ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ యవనికపై అత్యంత సంచలనాత్మక అంశంగా మారిన ఇరాన్-అమెరికా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. గురువారం నాడు దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ఇప్పుడు ముగింపు దశకు చేరుకుందని.. అమెరికా తన లక్ష్యాలను సాధించడంలో సఫలీకృతమైందని పేర్కొన్నారు.ఐదవ వారంలో కొనసాగుతున్న ఈ సంఘర్షణ ప్రజల్లో తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తున్న నేపథ్యంలో.. రాబోయే రెండు మూడు వారాల్లో యుద్ధం పూర్తిగా ముగుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ తక్కువ కాల వ్యవధిలోనే ఇరాన్‌ను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తామని, వారిని తిరిగి రాతియుగానికి పంపిస్తామంటూ తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల ఆమోద రేటింగ్‌లు తగ్గుతున్న తరుణంలో, అమెరికన్ల భద్రతే తన ప్రాధాన్యతని చాటుతూనే, ఈ యుద్ధం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి ముప్పు లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారుచమురు సంక్షోభం గురించి ప్రస్తావిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరల పెరుగుదలకు ఇరాన్ అనుసరిస్తున్న దుర్మార్గపు విధానాలే కారణమని విమర్శించారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధిని అడ్డుకోవడం ద్వారా ఇరాన్ అంతర్జాతీయ వాణిజ్యానికి విఘాతం కలిగిస్తోందని మండిపడ్డారు. ఇంధన కొరతతో బాధపడుతున్న దేశాలు ఇరాన్ వైపు చూడకుండా నేరుగా అమెరికా నుండే చమురు కొనుగోలు చేయాలని లేదా జలసంధికి వెళ్లి స్వేచ్ఛగా తీసుకోవాలని ఆయన సూచించారు.అమెరికా వద్ద 'డ్రిల్, బేబీ, డ్రిల్' కార్యక్రమం ద్వారా పుష్కలమైన గ్యాస్ నిల్వలు ఉన్నాయని.. తమ కాళ్ల కింద ఉన్న సహజ వనరులతో శక్తి రంగంలో అమెరికా అగ్రగామిగా ఉందని గుర్తుచేశారు. ఇటీవల పెరిగిన పెట్రోల్ ధరలు కేవలం తాత్కాలికమేనని, ఇరాన్ చేస్తున్న ఉగ్రవాద చర్యల వల్లే ఈ అస్థిరత ఏర్పడిందని ఆయన వివరించారు.పెట్టుబడిదారుల కొంపలు ముంచుతున్న ట్రంప్.. కుప్పకూలిన స్టాక్ మార్కెట్.. ఎంతలా అంటే..పెట్టుబడిదారుల కొంపలు ముంచుతున్న ట్రంప్.. కుప్పకూలిన స్టాక్ మార్కెట్.. ఎంతలా అంటే..ఇరాన్ అణ్వాయుధ సంపాదనను అడ్డుకోవడమే 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ప్రధాన ఉద్దేశమని ట్రంప్ స్పష్టం చేశారు. గత 47 ఏళ్లుగా ఇరాన్ ప్రభుత్వం అమెరికా - ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా చేస్తున్న నినాదాలను, సాగిస్తున్న దాడులను ఆయన ఏకరువు పెట్టారు. 1983 నాటి బీరుట్ బాంబు దాడి నుండి నేటి అక్టోబర్ 7 నాటి రక్తపాత దురాగతాల వరకు అన్నింటి వెనుక ఇరాన్ ఏజెంట్లు ఉన్నారని ఆరోపించారు.ఇరాన్‌ను ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశాలలో ఒకటిగా అభివర్ణిస్తూనే, అణ్వాయుధాల విషయంలో ఆ దేశాన్ని ఎన్నటికీ విశ్వసించలేమని తేల్చి చెప్పారు. అణ్వాయుధ ఇరాన్ అనే 'క్యాన్సర్'ను వదిలించుకోవడానికి అమెరికా ఆర్థికంగా, సైనికంగా ఇంతకంటే మెరుగ్గా ఎప్పుడూ లేదని, తమ బలమైన ఆర్థిక వ్యవస్థ ఈ యుద్ధం వల్ల కలిగే చిన్నపాటి కుదుపులను సులభంగా ఎదుర్కొంటుందని పేర్కొన్నారు.ఏదేమైనా ట్రంప్ ప్రసంగం యుద్ధం పట్ల అమెరికన్లలో ఉన్న వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నంలా కనిపిస్తోంది. యుద్ధం పరిమితమైనదని, త్వరలోనే ముగిసిపోతుందని చెప్పడం ద్వారా ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించే ప్రయత్నం చేశారు. ఇరాన్ పురోగతిని అడ్డుకుంటూనే, ప్రపంచ భద్రత స్వేచ్ఛా ప్రపంచం కోసం ఈ చర్య అత్యవసరమని ఆయన గట్టిగా వాదించారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ద్వారా ఇరాన్ ముప్పును శాశ్వతంగా తొలగిస్తామని ట్రంప్ తన ప్రసంగాన్ని ముగించారు.

# బెంగళూరు హౌసింగ్ మార్కెట్ ధమాల్



### ఒరాకిల్ లేఆఫ్స్ దెబ్బకు ఉద్యోగులు విలవిల

టెక్ దిగ్గజం ఒరాకిల్ సంస్థలో చోటుచేసుకుంటున్న భారీ ఉద్యోగాల కోతలు కేవలం ఐటీ రంగానికే పరిమితం కాకుండా.. బెంగళూరులోని రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. గత రెండు దశాబ్దాలుగా ఐటీ నిపుణుల స్థిరమైన ఆదాయం, పెరుగుతున్న జీతాల ప్రాతిపదికన వృద్ధి చెందిన నగర స్థిరాస్తి రంగం, ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఒరాకిల్ ఇప్పటికే భారతదేశంలో సుమారు 12 వేల మంది ఉద్యోగులను తొలగించగా.. రాబోయే నెల రోజుల్లో మరో విడత తొలగింపులు ఉంటాయన్న వార్తలు టెక్ నిపుణులలో ఆందోళనను పెంచుతున్నాయి. ఈ ఆకస్మిక పరిణామాలు గృహ కొనుగోలు దారుల ప్రవర్తనలో స్పష్టమైన మార్పుకు దారితీశాయి .బెంగళూరులోని ప్రధాన గృహ కొనుగోలు దారులైన ఐటీ ఉద్యోగులు ఇప్పుడు ఖరీదైన ఆస్తుల విషయంలో వెనక్కి తగ్గుతున్నారు. కొందరు ఇల్లు కొనాలనే నిర్ణయాన్ని పూర్తిగా వాయిదా వేస్తుండగా.. మరికొం దరు తమ ఆర్థిక భారాన్ని తగ్గించు కోవడానికి తక్కువ ధరలో లభించే నివాసాల వైపు మొగ్గు చూపుతున్నా రు. దీనివల్ల మార్కెట్‌లో డిమాండ్ పూర్తిగా పడిపోకపోయినా.. విక్ర యాల వేగం మందగించే సూచన లు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నగరంలో ఉద్యోగాలు కోల్పోయిన వారు ఇప్పటికే ఉన్న ఈఎంఐలు చెల్లించడానికి ఇబ్బంది పడుతుండగా.. ప్రస్తుతానికి ఉద్యోగాల్లో ఉన్నవారు భవిష్యత్తులో తమ పరిస్థితి ఏమవుతుందోనన్న భయంతో ఖర్చుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు.భారతదేశ ఐటీ సేవల రంగంలో చోటుచేసు కుంటున్న ఈ మందగమనానికి కృత్రిమ మేధ ప్రధాన కారణంగా మారుతోంది. గతంలో ఏటా 15 శాతం వృద్ధిని నమోదు చేసిన ఈ రంగం, ఇప్పుడు కేవలం 5-6 శాతానికి పరిమితమైంది. ఆటోమేషన్ వల్ల రాబోయే కొద్ది సంవత్సరాల్లో ఐటీ, కాల్ సెంటర్ ఉద్యోగాల్లో 20 శాతం వరకు కోత పడొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. ఈ మార్పుల వల్ల ఐటీ సంస్థలు మానవ శ్రమపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటున్నాయి. ఇది నేరుగా ఉపాధి అవకాశాలను, తద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులను దెబ్బతీస్తోంది.ఇన్నాళ్లూ రోబోలా బతికా.. ఇప్పుడు ఫ్రీ! వైరల్ అవుతున్న బెంగళూరు టెక్కీ స్టోరీ! ఇన్నాళ్లూ రోబోలా బతికా.. ఇప్పుడు ఫ్రీ! వైరల్ అవుతున్న బెంగళూరు టెక్కీ స్టోరీ!ఆర్థిక మార్కెట్లు కూడా ఈ ప్రతికూల పరిస్థితులను ఇప్పటికే గుర్తించాయి. దీని ఫలితంగా నిఫ్టీ ఐటీ సూచీ గణనీయంగా క్షీణించింది. ఒకవేళ ఏఐ స్వీకరణ మరింత వేగవంతమైతే, 2028 నాటికి ఐటీ ఎగుమతులు కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో టెక్ ఆదాయాలతో నేరుగా సంబంధం ఉన్న రియల్ ఎస్టేట్ వంటి రంగాలపై పరోక్ష ప్రభావాలు మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. మొత్తంమీద, ఒరాకిల్ వంటి సంస్థల నిర్ణయాలు బెంగళూరుతో పాటు హైదరాబాద్, పూణే వంటి ఐటీ ఆధారిత నగరాల భవిష్యత్తుపై పెద్ద ప్రశ్నార్థకాన్ని మిగిల్చాయి.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ముంచుకొస్తున్న ముడి చమురు ధరల ముప్పు

### హార్ముజ్ జలసంధి మూసివేతతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆగమాగం




ప్రపంచ ఇంధన భద్రతకు గుండెకాయ వంటి హార్ముజ్ జలసంధి మూసివేతతో అంతర్జాతీయ ముడి చమురు మార్కెట్ ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైన దశకు చేరుకుంది. ప్రతిరోజూ ప్రపంచవ్యాప్తంగా వినియోగించే చమురు, గ్యాస్‌లో సుమారు 20 శాతం వాటా ఈ ఇరుకైన సముద్ర మార్గం గుండానే సాగుతుంది. ఇరాన్ ఈ మార్గాన్ని దిగ్బంధించడంతో సరఫరా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. ప్రస్తుతం చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల వద్ద స్థిరంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ.. ఇది కేవలం తుఫాను ముందున్న ప్రశాంతత మాత్రమేనని అమెరికాకు చెందిన చమురు దిగ్గజ కంపెనీలు హెచ్చరిస్తున్నాయి. యుద్ధం ప్రారంభం కావడానికి ముందే ఓడల్లోకి ఎక్కించిన నిల్వలు, వివిధ దేశాల వద్ద ఉన్న వ్యూహాత్మక నిల్వల కారణంగా గత రెండు నెలలుగా మార్కెట్ కొంతమేర తట్టుకోగలిగింది. అయితే, ఈ "అనుకూల కాలం" ఇప్పుడు ముగిసిందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. షెవ్రాన్, ఎక్సాన్ వంటి అంతర్జాతీయ చమురు సంస్థల ఉన్నతాధికారుల విశ్లేషణ ప్రకారం, మార్కెట్లో అందుబాటులో ఉన్న అదనపు నిల్వలు, ఉత్పత్తి సామర్థ్యం వేగంగా తరిగిపోతున్నాయి. సాధారణంగా ఏదైనా సంక్షోభం తలెత్తినప్పుడు ధరలు నియంత్రణలో ఉండటానికి తోడ్పడే 'సేఫ్టీ మార్జిన్' ఇప్పుడు కనిష్ట స్థాయికి పడిపోయింది. ఇప్పటివరకు నిల్వ ఉంచిన సరుకుతో కాలం వెళ్లదీసిన దేశాలకు, జూన్ మరియు జూలై నెలలు అత్యంత గండ కాలంగా మారనున్నాయి. హార్ముజ్ జలసంధిని గనుక త్వరలో తెరవకపోతే, సెప్టెంబర్ నాటికి ప్రపంచ చమురు నిల్వలు చరిత్రలో ఎన్నడూ లేనంత అత్యల్ప స్థాయికి పడిపోయే ప్రమాదం ఉంది. ఇరాన్‌కు బిగ్ షాక్.. హార్ముజ్ జలసంధితో పనిలేదు.. ప్రత్యామ్నాయ రూట్ కనుగొన్న ఎంఎస్‌సి ఈ సంక్షోభం యొక్క ప్రభావం ముఖ్యంగా ఆసియా దేశాలపై తీవ్రంగా చూపుతోంది. చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే భారత్, చైనా వంటి దేశాల్లో ఇప్పటికే ఇంధన కొరత ఛాయలు కనిపిస్తున్నాయి. అనేక రిఫైనరీలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారడమే కాకుండా, రవాణా రంగంపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వాలు ప్రజలకు కీలక సూచనలు చేస్తున్నాయి.సాధ్యమైనంత వరకు వాహనాల వాడకాన్ని తగ్గించాలని, ఇంటి నుంచే పని చేసే సంస్కృతిని ప్రోత్సహించాలని కోరుతున్నాయి. సరఫరా పెంచే మార్గాలు మూసుకుపోవడంతో, డిమాండ్‌ను తగ్గించుకోవడమే ఏకైక ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. ఒకవేళ అంతర్జాతీయ దౌత్య చర్చలు విఫలమై, దిగ్బంధం ఇలాగే కొనసాగితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర మందగమనంలోకి వెళ్లే అవకాశం ఉందని చమురు రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఇరాన్ యుద్ధంలో కొత్త మలుపు

### సైబర్ దాడులను మొదలు పెట్టిన టెహ్రాన్.. బలయిన అమెజాన్..



అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పుడు డిజిటల్ యుద్ధ క్షేత్రానికి మళ్లాయి. బహ్రెయిన్‌లోని ప్రముఖ టెలికాం సంస్థ లక్ష్యంగా ఇరాన్ చేసిన సైబరాబాద్ దాడి అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది.ఇరాన్ మద్దతు ఉన్న సైబర్ గ్రూపులు బహ్రెయిన్‌కు చెందిన అగ్రశ్రేణి టెలికమ్యూనికేషన్ కంపెనీపై దాడి చేశాయి.ఈ కంపెనీ కేవలం బహ్రెయిన్‌కే పరిమితం కాకుండా, అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' కు ఆతిథ్యం ఇస్తుండటం గమనార్హం. అమెరికాకు చెందిన ఒక ప్రముఖ టెక్ కంపెనీ మౌలిక సదుపాయాలపై ఇరాన్ నేరుగా చేసిన మొదటి సైబర్ దాడిగా దీనిని నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ దాడి కారణంగా బహ్రెయిన్‌లోని డిజిటల్ నెట్‌వర్క్‌లు, అమెజాన్ సర్వీసులకు అంతరాయం కలిగింది.గత కొన్ని వారాలుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని హెచ్చరిస్తున్న తరుణంలో, ఈ సైబర్ దాడితో తన ప్రతీకారాన్ని తీర్చుకున్నట్లు కనిపిస్తోంది. భౌతిక దాడుల కంటే సైబర్ దాడులు తక్కువ ఖర్చుతో కూడుకున్నవని, అదే సమయంలో ప్రత్యర్థి దేశాల ఆర్థిక, సాంకేతిక వ్యవస్థలను కుప్పకూల్చడానికి ఇవి శక్తివంతమైన ఆయుధాలని ఇరాన్ భావిస్తోంది. ముఖ్యంగా అమెరికా క్లౌడ్ సేవలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికన్ టెక్ కంపెనీలకు ఇరాన్ ఒక గట్టి హెచ్చరికను పంపింది.ఇరాన్ కథను వచ్చే వారంలో ముగిస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన.. బెదిరింపులపై ఇరాన్ ఏమందంటే..ఇరాన్ కథను వచ్చే వారంలో ముగిస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన.. బెదిరింపులపై ఇరాన్ ఏమందంటే..మధ్యప్రాచ్యంలో అమెరికాకు బహ్రెయిన్ అత్యంత సన్నిహిత మిత్రదేశం. అమెరికా నౌకాదళానికి చెందిన ఐదవ నౌకాదళం (ƒష్ట్ర ఖీశ్రీవవ్) ప్రధాన కార్యాలయం ఇక్కడే ఉంది. అంతేకాకుండా, అబ్రహం ఒప్పందాల తర్వాత ఇజ్రాయెల్‌తో సంబంధాలను మెరుగుపరుచుకున్న గల్ఫ్ దేశాలలో బహ్రెయిన్ ఒకటి. ఈ నేపథ్యంలో, బహ్రెయిన్ యొక్క టెక్ మౌలిక సదుపాయాలను దెబ్బతీయడం ద్వారా అటు అమెరికాను, ఇటు గల్ఫ్ దేశాలను ఇరాన్ హెచ్చరిస్తోంది.ఈ సైబర్ దాడి వార్త బయటకు వచ్చిన వెంటనే అంతర్జాతీయ టెక్ మార్కెట్లలో ఆందోళన మొదలైంది. అమెజాన్ వంటి దిగ్గజ సంస్థల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌పై సైనిక చర్యను ముమ్మరం చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో, ఈ తాజా సైబర్ దాడి అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది. రాబోయే రెండు మూడు వారాల్లో ఇరాన్‌పై అమెరికా చేపట్టబోయే ఆపరేషన్‌లో భాగంగా ఈ సైబర్ బెదిరింపులను ఎదుర్కోవడానికి ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ బలగాలను రంగంలోకి దించే అవకాశం ఉంది.ఈ దాడి కేవలం ఒక ఆరంభం మాత్రమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష యుద్ధం మొదలైతే, అది కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా సాఫ్ట్‌వేర్, విద్యుత్ గ్రిడ్లు మరియు బ్యాంకింగ్ వ్యవస్థల వరకు విస్తరిస్తుంది. అమెరికా తన సైనిక లక్ష్యాలను పూర్తి చేయడానికి దగ్గరలో ఉన్నానని చెబుతున్న వేళ, ఇరాన్ తన సైబర్ సామర్థ్యంతో అమెరికా ప్రయోజనాలను దెబ్బతీయడానికి సిద్ధమవుతోంది. చమురు సరఫరా మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే ఒత్తిడిలో ఉండగా, ఇటువంటి డిజిటల్ దాడులు పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయి.ఏదేమైనా బహ్రెయిన్ టెలికాం, అమెజాన్ సర్వీసులపై జరిగిన ఈ దాడి, ఆధునిక యుద్ధం కేవలం క్షిపణులతోనే కాదు, కంప్యూటర్ కోడ్లతో కూడా జరుగుతుందని మరోసారి నిరూపించింది. రాబోయే రోజుల్లో అమెరికా తన వ్యూహాన్ని మార్చుకుని ఇరాన్ సైబర్ విభాగాలపై కూడా దాడులు చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# ఇరాన్ కథను వచ్చే వారంలో ముగిస్తాం

### ట్రంప్ సంచలన ప్రకటన.. బెదిరింపులపై ఇరాన్ ఏమందంటే



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం వైట్ హౌస్ వేదికగా చేసిన ప్రకటన మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలను మరింత పెంచింది. ఇరాన్ అణ్వాయుధాన్ని సాధించకుండా నిరోధించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన ట్రంప్.. రాబోయే రెండు మూడు వారాల్లో ఇరాన్‌పై సైనిక చర్యను అత్యంత తీవ్రస్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు.ఒకవేళ టెహ్రాన్ ప్రభుత్వం చర్చలకు ముందుకు రాకపోయినా లేదా ప్రతిపాదిత ఒప్పందాన్ని అంగీకరించకపోయినా, ఆ దేశ విద్యుత్ మౌలిక సదుపాయాలపై ఏకకాలంలో దాడులు చేస్తామని, తద్వారా ఇరాన్‌ను తిరిగి రాతియుగానికి పంపిస్తామని ఆయన చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ సమాజాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.



## ఏంటీ ప్రభాస్ కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడా..?

ప్రభాస్ అభిమానులతో, సైన్స్ ఫిక్షన్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి 'కల్కి 2898 ఏడీ' ఫ్రాంచైజీ. ఇప్పటికే ఫస్ట్ పార్ట్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రభాస్–నాగ్ అశ్విన్ టీం ఇక సీక్వెల్‌తో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళుతుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం ఇప్పటికే అమితాబ్ బచ్చన్ షూట్‌లో పాల్గొన్నట్టు ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. హీరో ప్రభాస్ నేడు కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడట. ఎక్కువగా నైట్ షూట్స్ ఉండనుండగా.. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్‌లో పాల్గొనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ షూట్‌కు సంబంధించి మేకర్స్ ఏమైనా అప్‌డేట్స్ అందిస్తారేమో చూడాలి. కాగా ఫస్ట్ పార్ట్‌లో దీపికా పదుకొనే పోషించిన సుమతి పాత్ర కోసం సీక్వెల్‌లో ఇంకా ఏ నటిని ఫైనల్ చేయలేదు మేకర్స్. కమల్ హాసన్‌తోపాటు పలువురు కీలక నటీనటులు సీక్వెల్‌లో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అప్‌డేట్ రావాల్సి ఉంది. భారీ విజువల్ వండర్‌గా మారిన 'కల్కి 2898 ఏడీ'లో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి లీడ్‌యాక్టర్లు నటించడంతో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. భారీ విఎఫ్‌ఎక్స్, యూనిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫస్ట్ పార్ట్‌ను తెరకెక్కించిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ ఈ చిత్రాన్నినిర్మించనున్నారు.

## బాడీ షేమింగ్‌తో నరకం చూశా.. 15 రోజులు ఆసుపత్రిలో చికిత్స






ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సురేఖా వాణి కుమార్తెగా ప్రేక్షకులకు పరిచయమైన సుప్రిత ఇటీవల తన వ్యక్తిగత జీవితంలోని కఠిన అనుభవాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. సోషల్ మీడియా స్టార్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, ప్రస్తుతం హీరోయిన్‌గా సినీ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సుప్రిత, సోషల్ మీడియాలో ఎదురైన విమర్శలు, బాడీ షేమింగ్ కామెంట్లు తనపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు. బరువు తగ్గాలనే ఆరాటంలో తాను అనుసరించిన తప్పుడు ఆహారపు అలవాట్లు తన ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీశాయని వెల్లడించారు.రోజుకు 15 గంటల పాటు ఏమీ తినకుండా ఉండి, తర్వాత ఒక్కసారిగా హెవీ ఫుడ్ తీసుకునేదాన్ని. దీంతో వాంతులు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చాయి. 15 రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. నీళ్లు తాగినా కూడా పడని పరిస్థితి. ఆ నొప్పి తట్టుకోలేక ఒక దశలో 'నన్ను చంపేయండి' అని అమ్మను అడిగాను అంటూ తన అనుభవాన్ని వివరించారు.

## బన్నీ సీక్రెట్స్ వైరల్.. అల్లు అర్జున్‌పై శిరీష్ సరదా కామెంట్స్!



పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన అల్లు అర్జున్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారీ క్రేజ్‌ను సొంతం చేసుకున్నాడు. ముఖ్యంగా 'పుష్ప' సినిమాతో ఆయన రేంజ్ అమాంతం పెరిగిపోయింది. ఉత్తరాదిలో కూడా విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుని, టాప్ స్టార్‌ల సరసన నిలిచాడు. దీంతో బన్నీతో సినిమా చేయడానికి పలువురు దర్శకులు ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి సమయంలో ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ పాత వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ఆయన తమ్ముడు అల్లు శిరీష్ చేసిన కామెంట్స్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. గతంలో అల్లు శిరీష్, నటుడు అలీ హోస్ట్ చేసిన 'అలీతో సరదాగా' కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యాడు. ఆ సందర్భంగా తన అన్న అల్లు అర్జున్ గురించి సరదాగా మాట్లాడుతూ చిన్నప్పటి జ్ఞాపకాలను పంచుకున్నాడు. శిరీష్ మాట్లాడుతూ, చిన్నప్పుడు బన్నీకి చదువు అంతగా రాదని సరదాగా చెప్పాడు. "అమ్మ రాత్రంతా కూర్చోబెట్టి ఎంత చదివించినా, ఉదయానికి చదివింది మొత్తం మర్చిపోయేవాడు. పరీక్షల్లో కూడా పెద్దగా రాసేవాడు కాదు" అంటూ నవ్వుతూ చెప్పిన వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ వైరల్ అవుతున్నాయి. ఇక మరో సందర్భంలో తమ అన్నదమ్ముల మధ్య ఉన్న అనుబంధాన్ని కూడా శిరీష్ వివరించాడు. "నేను ఏ కొత్త డ్రెస్ వేసుకున్నా ముందుగా బన్నీ వేసుకునేవాడు. తర్వాత నేను వేసుకుంటే అందరూ 'ఇది బన్నీ డ్రెస్ కదా' అని అడిగేవారు" అంటూ చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకున్నాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండగా, అభిమానులు సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. కొందరు బన్నీ చిన్నప్పటి విషయాలు తెలిసి ఆశ్చర్యపోతుండగా, మరికొందరు అన్నదమ్ముల బాండింగ్‌ను మెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా, అల్లు అర్జున్ ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నాడు. 'పుష్ప 2' విజయానంతరం ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు దర్శకుడు అట్లీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన టైటిల్ పోస్టర్‌లో బన్నీ లుక్ పూర్తిగా భిన్నంగా ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.



## 'వారణాసి' షూటింగ్‌కు నీటి కష్టాలు... రాజమౌళి ప్లాన్‌కు బ్రేక్ పడిందా!

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. భారీ బడ్జెట్‌తో శ్రీ దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై నిర్మితమవుతున్న ఈ చిత్రం కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భారీ సెట్లు నిర్మించారు. ముఖ్యంగా రాజేంద్రనగర్‌లోని గగన్‌పహాడ్ ప్రాంతంలో వేసిన సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.తాజాగా ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సినిమాలో భాగంగా నీటి అడుగున జరిగే కొన్ని సన్నివేశాలను చిత్రీకరించేందుకు రాజమౌళి ప్లాన్ చేశారట. ఇందుకోసం భారీ స్థాయిలో నీరు అవసరమవుతుందని, దాదాపు 10 వేల లీటర్ల సామర్థ్యం గల 150 ట్యాంకర్ల నీటిని సరఫరా చేయాలని నిర్మాణ సంస్థ హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ను సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఎండలు తీవ్రంగా ఉండటం, నగరంలో నీటి డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ అభ్యర్థనను వాటర్ బోర్డ్ తిరస్కరించిందని వార్తలు వినిపిస్తున్నాయి. సరఫరా చేసే నీటిని శుద్ధి చేసి వినియోగించుకోవాలని, ట్యాంకర్ ఛార్జీలను నిర్మాతలే భరిస్తారని లేఖలో పేర్కొన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అంతటి నీటిని అందించడం సాధ్యం కాదని అధికారులు తెలిపినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై అధికారిక ధృవీకరణ ఇంకా వెలువడలేదు. ఇక మరోవైపు మహేష్ బాబు ఇటీవల జర్మనీకి వెళ్లి బ్లాక్ ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్, ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలోనే తదుపరి షెడ్యూల్ ప్రారంభం కానుండగా, మే 18 నుంచి అండర్‌వాటర్ సన్నివేశాల షూటింగ్ చేపట్టాలని చిత్రబృందం యోచిస్తోంది. ఈ సినిమాలో మహేష్ బాబు ద్విపాత్రాభినయం పోషిస్తుండగా, 'రుద్ర' మరియు 'శ్రీరాముడు' పాత్రల్లో కనిపించనున్నారని టాక్. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాశ్ రాజ్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథను విజయేంద్ర ప్రసాద్ అందిస్తుండగా, సంగీతాన్ని ఎం.ఎం. కీరవాణి సమకూరుస్తున్నారు. 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ భారీ చిత్రం గురించి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం నీటి వివాదం నిజమా కాదా అన్నది క్లారిటీ రావాల్సి ఉంది.

## త్రిష బర్త్ డే స్పెషల్.. పోస్టర్ విడుదల, అవనిగా మెప్పించనున్న చెన్నై చంద్రం

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ ఎపిక్ 'విశ్వంభర' సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా నటి త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఆమె క్యారెక్టర్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ పోస్టర్‌లో త్రిష ట్రెడిషనల్ లుక్‌లో డివైన్ ఔరాతో కనిపిస్తూ ఆకట్టుకుంది. అయితే ఇది కేవలం గ్లామర్ పాత్ర మాత్రమే కాదని, కథలో కీలక పాత్ర పోషించబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, త్రిష పోషిస్తున్న 'అవని' పాత్ర సినిమా కథలో కీలక మలుపులు తీసుకువచ్చే ప్రధాన అంశంగా ఉండనుంది. ముఖ్యంగా ఈ పాత్ర చుట్టూనే సినిమా నెరేషన్ తిరిగే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు త్రిష చేసిన పాత్రలతో పోలిస్తే, ఈ పాత్రలో ఎక్కువ ఎమోషనల్ వెయిట్, డెప్త్ ఉండబోతుందని తెలుస్తోంది. కేవలం స్క్రీన్ ప్రెజెన్స్‌కే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే డ్రైవింగ్ ఫోర్స్‌గా అవని పాత్ర ఉండటం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత కొన్నేళ్లుగా సెలెక్టివ్ ప్రాజెక్ట్స్‌తో ముందుకు సాగుతున్న త్రిషకు 'విశ్వంభర' ఒక స్ట్రాంగ్ కంబ్యాక్‌గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పాత్ర దక్కడం ఆమె కెరీర్‌కు మరో మైలురాయిగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మెగాస్టార్ చిరంజీవి–త్రిష కాంబినేషన్ కూడా ఈ సినిమాకు మరో ప్రధాన హైలైట్. గతంలో వీరిద్దరి మధ్య ఉన్న ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో వారి పాత్రలు ఎలా మలచబడ్డాయో అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఇద్దరి ట్రాక్ సినిమా ఎమోషనల్ కోర్‌గా నిలుస్తుందని టాక్. ఈ చిత్రానికి దర్శకుడు వశిష్ట విజువల్ ట్రీట్ ఇవ్వడానికి భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి వీఎఫ్‌ఎక్స్ స్టూడియోలు ఈ ప్రాజెక్ట్‌పై పనిచేస్తున్నాయని సమాచారం. దీంతో 'విశ్వంభర' విజువల్‌గా కూడా అద్భుతంగా ఉండనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో వేగంగా కొనసాగుతోంది. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం టాలీవుడ్‌లో నెవర్ బిఫోర్ అనిపించే స్థాయిలో ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో రూపొందుతోంది. మేకర్స్ త్వరలోనే రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశముంది.




The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.